


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## జీఎన్ నాయుడికి సీఎం నివాళి




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 123 | ఆదివారం 023 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3


## సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...



శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం

ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ

ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్

# పదిలమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

**అ ధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కారం**

**మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచన**





## శ్రీవారి భక్తులతో జగన్ చానల్ ‘రోత’ రాజకీయం

**టీటీడీ ఏర్పాట్లు బాలేవని చెప్పించేందుకు పాట్లు**

**వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్**

**అసత్య ప్రచారాలు నమ్మొద్దని టీటీడీ ఖండన**

టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తుల్లో అసంతృప్తి ఉన్నట్టుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి జగన్ సొంత రోత మీడియా చానల్ భంగపడింది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమల క్యూలైన్‌లోకి చేరే భక్తులకు నిరంతరం అన్నపానీయాలు అందజేయడంతో పాటు వీలైనంత త్వరగా దర్శనం చేయించేలా టీటీడీ క్యూలైన్లను సమర్థంగా నిర్వహిస్తోంది. అయితే టీటీడీ ఏర్పాట్లు సక్రమంగా లేవని చెప్పించేందుకు జగన్ చానల్ కెమెరామన్ చేసిన ప్రయత్నాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రింగురోడ్డులోని సర్వదర్శన క్యూలైన్‌లో ఉన్న ఓ భక్తుడిని శుక్రవారం కెమెరామన్ మాట్లాడించారు. ‘ఎన్ని గంటలకు వచ్చారు? ఇంకా ఎంత టైం పడుతుందంటున్నారు? ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?’ అని ప్రశ్నించగా.. భక్తుడు ‘అంతా బాగుంది’ అంటూ బదులిచ్చి వెళ్లిపోయారు. ఆ వీడియోను మంత్రి లోకేశ్ తన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టు చేశారు. ‘అంతా బాగుందని చెప్తున్న భక్తులతో ఏర్పాట్లు బాగా లేవు.. ఇబ్బంది పడుతున్నాం.. అని చెప్పించడానికి ప్రయత్నించి భంగపడుతున్న సాక్షి చానల్’ అనే శీర్షిక పెట్టారు. ‘కలియుగ దైవంతో పెట్టుకోవద్దు జగన్మోహన్ రెడ్డి గారూ’ అంటూ వీడియో కింద రాశారు.

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు



గత కొంతకాలంగా పవన్ కు అనారోగ్య సమస్యలు

ఇటీవలే హైదరాబాద్‌లో శస్త్రచికిత్స

హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు

శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన

తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్

# 200 సీట్లలో గెలవబోతున్నాం



### ఎగ్జిట్ పోల్స్ నమ్మబోమన్న మమత

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంనాడు ఆమె మాట్లాడారు. ’200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం’ అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్కెను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు



**మరోమారు మెలిక పెట్టిన ట్రంప్**

## చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు



కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్న రజిని

అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని ఆరోపణ

జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని వ్యాఖ్య

# బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్.



పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్

సాయంత్రం 5 గంటలకే సగటున 86.90 శాతం పోలింగ్ నమోదు

తుది పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారుల అంచనా

## దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోం

**ఆకివీడు రామాలయు ఘటనపై మందకృష్ణ మాదిగ**

నంది పత్రిక

ఆదివారం 03 - 05 -2026

# 200 సీట్లలో గెలవబోతున్నాం

సీఏపీఎఫ్ దౌర్యనాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు. కాగా, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారంనాడు రీపోలింగ్ జరిగింది. పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ క్రమంలో సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు సైతం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీ బలగాలు మోహరించినా టీఎంసీ గుండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్టాం÷-రగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈనెల 4న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్..

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయింది. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ ప్రక్రియ జరిగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 15 బూత్‌లలో కలిపి సగటున 86.90 శాతం ఓటింగ్ నమోదైంది. మగ్రాహత్ (పశ్చిమ) నియోజకవర్గంలోని 11 బూత్‌లలో 86.11 శాతం, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 బూత్‌లలో 87.60 శాతం పోలింగ్ నమోదైనట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. తుది గణాంకాలు తేలిన తర్వాత పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రీపోలింగ్‌లో ఇది చాలా అధికమని వారు పేర్కొన్నారు. ఈసారి రెండు దశల్లో (ఏప్రిల్ 23, 29) జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 93 శాతం పోలింగ్ నమోదై స్వాతంత్ర్యం తర్వాత కొత్త రికార్డు సృష్టించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు... 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికి, బీజేపీ అధికారంలోకి వస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

# దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోం

:ఆకివీడు పెద్దపేట రామాలయం అంశంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పందించారు. దళిత వర్గాలకు చెందిన వారిని ఎవరు ఇబ్బంది పెట్టినా, ఆత్మ గౌరవం దెబ్బ తీసేలా వ్యవహరించినా ఉరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమపై దాడి చేసే వాళ్లు ఏ స్థాయి వారైనా సరే ఉమ్మడిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఆకివీడు దళితవాడలోని గుడి విషయంలో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నట్లు కృష్ణ మాదిగ తెలిపారు. అక్కడ గొంతేనమ్మ గుడి, గ్రామ సావిడి, రామాలయం ఉందా? అనే అంశంలో న్యాయస్థానం తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ వివాదమంతా ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చుట్టూ తిరుగుతోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వ గెలుపులో తాము ప్రధాన భాగస్వాములుగా ఉన్నామని మందకృష్ణ గుర్తు చేశారు. రామాలయం వివాదాన్ని తానే స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా మాట్లాడే మాటలు.. రఘురామ ఉన్న పార్టీకి మేలు చేయాలే తప్ప కీడు చేయకూడదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో రఘురామ ఉన్నారని.. ఆయన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని పార్టీకి, ప్రభుత్వానికి దూరం చేసేవిగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా దళితులను అవమానించే విధంగా డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు ఉన్నాయని మందకృష్ణ ఆగ్రహించారు.

# పాలమూరు పట్టణాభివృద్ధికి ప్రణాళికలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, అధునాతన హంగులతో నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భారీ నిధులు సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతునట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్‌కు కార్పొరేషన్, ముడా ఛైర్మన్లతో కలిసి శంకుస్థాపన చేశారు. నగర సుందరీకరణలో భాగంగా పట్టణంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో పార్కులు, ఓపెన్ జిమ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే మూడా ఆధ్వర్యంలో అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఉన్న మైదానాలకు వేలాది మంది వాకర్స్ వస్తుండటంతో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

# జైలు నిబంధనల మేరకే అనంతబాబుకు సదుపాయాలు

రాజమండ్రి,మే2(ఆర్ఎన్ఎ): రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారంపై జైలు అధికారులు స్పందించారు.అనంతబాబు జైల్లో ప్రత్యేక సదుపాయాలు కోరిన విషయం వాస్తవమేనని అధికారులు అంగీకరించారు. అయితే జైలు నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాల ప్రకారం మాత్రమే సదుపాయాలు కల్పిస్తామని ఆయనకు స్పష్టంగా తెలియజేసినట్లు అధికారులు వెల్లడించారు. జైలు నిబంధనలకు లోబడి ఖైదీలకు అవసరమైన సదుపాయాలు మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు.

# ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్ పౌరసరఫరాలో అత్యంత అవినీతి

కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్

అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్ట్‌లనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## థాయ్‌లాండ్ వెళుతున్నారా? అయితే ఇది ఉండాల్సిందే!

విదేశీ పర్యాటకులకు స్వర్గధామమైన థాయ్‌లాండ్‌కు వెళ్లే వారికి త్వరలో ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) తప్పనిసరి కానుంది. దేశంలోకి అడుగుపెట్టే పర్యాటకులు, విదేశీ కార్మికులు, ఇతర సందర్శకులందరికీ ఆరోగ్య బీమాను తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదనను థాయ్ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ నిర్ణయం ద్వారా దేశ ఆరోగ్య వ్యవస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. విదేశీ రోగులు ఆసుపత్రుల్లో చికిత్స పొంది, బిల్లులు చెల్లించకుండా వెళ్తున్న ఉదంతాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని థాయ్ పబ్లిక్ హెల్త్ మంత్రి పట్టానా ప్రాంఫాట్ తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రులు, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లోని వైద్యశాలలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# రఘురాయ్ 'భారత దర్శనం'

తన ఎనభై మూడో ఏట, ఏపిల్ 26న కాలం చేసిన రఘురాయ్ భారతీయ ఛాయాచిత్రకారుల్లో అగ్రగణ్యులు. అంతర్జాతీయ స్థాయిలోనూ వారు అద్వితీయ కళాకారులు. పత్రికారంగం నుంచి ప్రారంభమైన వారి ప్రస్థానం, స్వతంత్ర ఫొటో జర్నలిస్ట్‌గా ఎదిగిన తీరు, సాగిన క్రమం నిరాటంకం, అపురూపం, అద్భుతం. ప్రప్రథమంగా ఆరు దశాబ్దాల వారి స్థిమితమైన సుదీర్ఘ ప్రయాణంలో తప్పక చెప్పుకోవలసింది ఆయన దృక్పథం గురించి. దేశీయం అని ఒక్క మాటలో చెప్పడం సరికాదు. మరి, దాన్ని సులభంగా ఎలా చెప్పవచ్చునూ అంటే, వారి ప్రదర్శనలే చూడనక్కరలేదు. అవి కాకుండా ప్రపంచంలో మరే ఫొటోగ్రాఫర్ ప్రచురించనన్ని కాఫీ టేబుల్ బుక్స్ వారే తెచ్చారు. అందుబాటులో ఉన్న అవే సాక్ష్యం. సుమారు యాభై పుస్తకాలుగా తన పనిని చరిత్రలో భాగం చేసి వెళ్ళిన రఘురాయ్‌కి తన పుస్తకాల్లో అమిత ఇష్టమైన గ్రంథం నలుపు తెలుపుల్లో తెచ్చిన 'రఘురాయ్స్ ఇండియా'. ఈ శీర్షికే ఆయన కళా దృక్పథానికి కొలమానం. ఇదే శీర్షికతో వారు రంగుల్లోనూ మరో గ్రంథం తెచ్చారు. విస్పష్టంగా రఘురాయ్ ఒక్కరే ఈ దేశాన్ని ఆత్మవిశ్వాసంతో పని ఆధారితంగా 'నా దేశం' అన్న ఏకైక ఛాయాచిత్రకారుడు. ఇక్కడి మనిషిని, మానును, ఉత్సవాలను, విషాదాలను, వార్తను, కథనాన్ని, రాజకీయ పరిణామాలను... అవేమైనా సరే, వాటిని దర్శించి ప్రతిదాన్నీ తాను 'భారతం' చేశారు. తనకన్నా ముందు, తన తర్వాతా ఎందరో ఛాయాచిత్రకారులు మన దేశాన్ని చిత్రించినా, ఇంకనూ చిత్రిస్తున్నప్పటికీ, వారెవరికీ లేని దృక్పథం రఘురాయ్ సొంతం. ఆయన 'ఇది నా దేశం' అని సగర్వంగా చిత్ర సహితంగా చాటిన ఏకైక కళాకారుడు. అంతేకాదు, “నా దేశాన్ని మినహా మరే దేశాన్ని చిత్రించను” అని ప్రకటించిన ఏకైక చిత్రకారుడు కూడా ఆయనే. దేశం దాటితే ఆయన కెమెరా మూసి పెడతారు. కళ్ళతోనే చూస్తారు. కెమెరా తెరిస్తే అది తన దేశం, మనిషి, స్థలం, మన మహిమ, అంతే. అదీ ఆయన ఘనత. ఈ దేశంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని ఆయన అర్థం చేసుకుని చిత్రించినంత విశాలంగా మరొకరు చిత్రించలేదు కూడా. ఒక్క మాటలో ఈ దేశ ప్రజానీకపు విభిన్న జీవన సాంస్కృతిక సామరస్య సంపుటి 'రఘురాయ్స్ ఇండియా'. ఆయన మొదటి చిత్రమే గాడిద. బేబీ డాంకీ. అందరూ అడ్డ గాడిదను చూసే తీరుకు భిన్నంగా ఆయన నిలువు గాడిదను చిత్రించి దాన్ని సమ్మోహనంగా ఒక యోగిలా చూపారు. అదీ మొదలు ఇక ఆయన వెనుదిరిగి చూడలేదు. అనుభవం గడించినకొద్దీ ఆయన 'నిలువు' నుంచి 'అడ్డం' వైపు తిరిగారు. ఇదే ఆయనను మిగతా వారికి భిన్నం చేసింది. ఈ దేశాన్ని చూడాలంటే వర్టికల్‌గా శిఖరాలు కాదు, హారిజాంటల్‌గా మైదానాలు చూడాలి అన్న ధోరణి అవలంబించారు. అందుకే ఆయన మన దేశాన్ని 'హారిజాంటల్ ఇండియా' అని పేర్కొనడమే కాదు, పదే పదే నొక్కి చెప్పారు. “అడ్డంగా తీసే చిత్రంలోనే సామాన్యం నుంచి అసామాన్య విశేషాలనెన్నిటినో దర్శించవచ్చు” అన్నారు. అడ్డదిడ్డంగా పనిచేసిన ప్రభుత్వాలనూ ఆయన ఇదే ధోరణిలో ఎండగట్టారు. విశేషం ఏమిటంటే, ఒక చిత్రం తీస్తున్నప్పుడు ఆయన రెండు మూడు నిమిషాలు సైతం వ్యూ ఫైండర్ నుంచి కన్ను ఆర్పకుండా చూసేవారు. ఒక దృశ్యాన్ని చప్పున చూసి తీసిన వారు కాదు. చూస్తూ చూస్తూ దర్శనం వంటి అనుభవం గ్రాహ్యం అయ్యేదాకా వేచి ఉండి క్లిక్ చేసేవారు. అందుకే ఆయన చిత్రంలో ఏకకాలంలో అనేక కాలాలను చదవవచ్చు. దీన్ని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే వారు తరచూ చెప్పే 'సెంచరీస్ లివ్ టుగెదర్' అన్న మాటను, అందులోని భావనను గమనించాలి. “అనేక శతాబ్దాల ఒరవడి వినిపించే నాగరిక దేశం మనది” అన్నారు. “చార్మినార్ వద్దకు వెళ్లి నిలబడు. నీతో పాటు జవసత్వాలతో హుందాగా, సమున్నతంగా పదిహేనో శతాబ్దం కానవస్తుంది” అన్నారు. దానర్థం, ఒక ఫ్రేంలో అనేక ఫ్రేంలు. పొరలు పొరలుగా జీవన శకలాలు. ఒక రకంగా పురాతత్వ సంపదను వెలికి తీసే ఆర్కియాలజిస్ట్‌గా, ఒక చరిత్రకారుడిగా ఆయన మన స్థలకాలాదుల్లో ఉన్న అన్ని విశేషాలనూ విని, ఒక్క చిత్రంలోనే ఆ ధ్వనిని నిక్షిప్తం చేసి, మనకు వినిపించిన అపూర్వ సంగీతజ్ఞుల వంటి ఛాయచిత్రకారులు ఆయన. అందుకే రఘురాయ్ లేరు అన్న బాధ అక్కరలేదు. ఆయన ప్రతి ఫొటో మనకు గతాన్ని వినిపించే వర్తమానం. భవితకు సోపానం. మరో విశేషం ఏమిటంటే... తాను తీస్తున్నది 'హారిజాంటల్ ఇండియా' అనడమే కాదు, అందులో తాను చిత్రిస్తున్నది మనిషినైనా, సంఘటననైనా లేదా ల్యాండ్‌స్కేప్ అయినా తాను దృష్టిలో పెట్టుకునేవి రెండే అంశాలని చెప్పారు. అవేమిటో కాదు.. “ఎనర్జీ, ఎక్స్‌ప్రెషన్” అని వివరించారు. “ఆరు దశాబ్దాలుగా నేను గమనిస్తూ వచ్చింది ఈ రెండే” అని బోధపరిచారు. ఈ దేశంలోని శక్తి ఎలా నిబిడీకృతమైందో, అది ఎలా ప్రవహిస్తున్నదో ఆయన దేశమంతా తిరిగి చూశారు, చిత్రించారు, పదిలపరిచారు. మనం చూసే చిత్రం ఇందిరాగాంధీనో, మదర్ థెరిసానో అనిపిస్తుంది లేదా ఆ చిత్రంలో మనం దలైలామాను చూస్తాం. కాదంటే అది కుంభమేళా అనుకుంటాం, లేదా ఏడుపాయల జాతర అని భావిస్తాం. కానీ, వాటిల్లో ఆయన చూస్తున్నది ఈ దేశంలోని ఆత్మ. అది శక్తి. ఆ ఆత్మ ఎలా ప్రతిచోటా ప్రతిదృశ్యంలోనూ ప్రవాహ సదృశ్యమైపోతున్నదో అది వ్యక్తీకరణ. దాన్నీ ఆయన చిత్రించారు. అంటే వారు ఈ దేశ ఆత్మను, ఆ ఆత్మ తారాడే రీతిని వ్యక్తపరిచారు. ఈ రెండింటి నిక్షిప్తం కళాకారులు. ఇప్పుడు గమనించండి. శక్తి, దాని వ్యక్తరూపం. అదే భారతం. రఘురాయ్ కూడా. అందుకే అనడం, రఘురాయ్ సిసలైన ముద్దుబిడ్డ. మన దేశం చరిత్రను దర్శించిన తీరు, పదిలపరిచిన తీరు కేవలం ఒక ఛాయాచిత్రకారుడిగానే కాదు, దేశీయ చిత్రకారుడిగా, మనం ఎన్నడూ మరచిపోలేని కృతికర్తగా, స్మృతికర్తగా భరతమాత సిసలైన ముద్దుబిడ్డగా వారు సదా నిలిచిపోతారు. చివరగా, రఘురాయ్ భారతమే వారిని అంతర్జాతీయం చేసిందనడానికి ఒక ప్రస్తావన. గత ఏడాది మరణించిన సెబాస్టియో సాల్గాడో అన్న ప్రసిద్ధ బ్రెజిలియన్ ఛాయాచిత్రకారుడు ప్రపంచంలోని నూటా ఇరవై దేశాలు తిరిగి ఛాయాచిత్రలేఖనం చేశారు. వారు కరోనా సమయంలో రఘురాయ్‌తో జరిపిన సంభాషణ ఈ దిశలో ఒక గొప్ప మెలకువ. అయన ఒక అద్భుతమైన మాట అన్నారు. “నేను ప్రపంచం మొత్తం తిరిగాను. కానీ, చిత్రంగా రఘురాయ్ ఈ దేశాన్ని విడవలేదు. నిజానికి వారే నాకన్నా గొప్ప” అన్నారు. “ఎందుకూ అంటే నా దేశంలో ఏమీ లేక తిరగవలసి వచ్చింది. రఘురాయ్ అలా కాదు, వారి ఇంగితం అపూర్వం. ఆయనకు తన దేశం ఘనత తెలుసు. అది బహుళం, వైవిధ్యం, విస్తారం అని గ్రహించిన దార్శనికుడు ఆయన. అందుకే దాన్ని విడిచి మరెక్కడికీ వెళ్ళలేదు. వెళ్ళదలచుకోలేదు. నా దేశమే నా ప్రపంచం అని సగర్వంగా చాటి చెప్పారు. నా దృష్టిలో రఘురాయ్ నాకన్నా అంతర్జాతీయం, విశ్వం” అని ఆత్మీయంగా కొనియాడారు. రఘురాయ్ కూడా గౌరవంగా తలవంచి నమస్కరిస్తూ, సెబాస్టియో అభినందనను హుందాగా స్వీకరించారు.

# సంపన్న అమ్మాయిలే టార్గెట్

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతులను, ముఖ్యంగా సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మాయిలను మాయమాటలతో ట్రాప్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న అర్జున్, అతని సోదరుడు రాజీవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో అర్జున్, రాజీవ్‌ను ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ అమ్మాయిలను బుట్టలో వేసుకోవడం నిందితుల ప్లాన్ అని పోలీసులు చెప్పారు. ఇప్పటికే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మోసాల్లో రాజీవ్ క్రియాశీలకంగా వ్యవహరించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. పరారీలో ఉన్న రాజీవ్‌ను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బెంగళూరులో పట్టుకున్నారు. నిందితులు యువతులను ట్రాప్ చేయడానికి ఒక పక్కా ప్లాన్ ప్రకారం వ్యవహరించేవారని పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాసవంతమైన హోటల్స్‌లో దిగిన రీల్స్, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారని అన్నారు. తాము కూడా పెద్ద ధనవంతులమని యువతులను నమ్మించేవారని చెప్పారు. హైదరాబాద్‌లోని విలాసవంతమైన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో నివసించే సంపన్న కుటుంబాల పిల్లలను ఈ నిందితులు ప్రధానంగా లక్ష్యంగా చేసుకునేవారని వెల్లడించారు. అమ్మాయిలను పరిచయం చేసుకున్న కొద్దిరోజులకే ప్రేమ నటిస్తూ, పెళ్లి చేసుకుంటామని నమ్మబలికేవారని అన్నారు. యువతుల నమ్మకాన్ని పొందిన తర్వాత అసలు పని మొదలుపెట్టేవారని తెలిపారు. సాన్నిహిత్యం పెరిగిన తర్వాత అమ్మాయిల వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి, వాటిని అడ్డం పెట్టుకుని భయపెట్టడం, అత్యవసరాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసేవారని పోలీసులు వెల్లడించారు. నిందితులు దాదాపు 10 మందికి పైగా యువతులను ఇదే తరహాలో ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెను కూడా ప్రేమ పేరుతో వేధించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ సుమారు రూ. 13 లక్షల నగదును వసూల్ చేశారని పోలీసులు తెలిపారు. నిందితుడు అర్జున్‌పై కేవలం జూబ్లీహిల్స్‌లోనే కాకుండా, నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యా యని అన్నారు. నిందితులను సమగ్రంగా విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. వీరు ఇంకా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు?, ఈ ముఠాలో ఇంకా ఎవరైనా సభ్యులు ఉన్నారా?, వీరు వసూలు చేసిన సొమ్మును ఏం చేశారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. “ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది“ అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు.ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతిలోని అద్దాల మేడలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన ఆమె, జగన్ హయాంలో 66 లక్షలకు పైగా ఉన్న పెన్షన్లలో ఇప్పుడు ఏకంగా 6 లక్షల పెన్షన్లను కట్ చేశారని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు.ఒకవైపు రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఆ నిధులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తమ విలాసాల కోసం, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల ప్రయాణాల కోసం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, అడుగుకు రూ.18,500 పైనే ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా లేని విడ్డూరమని రజిని పేర్కొన్నారు. కేవలం అక్కడ అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులతో మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించవచ్చని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టి సామాన్యుడి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే అమరావతికి వ్యతిరేకం అంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని అన్నారు.

# శ్రీవారి భక్తులతో జగన్ చానల్ 'రోత' రాజకీయం

కదులుతున్న క్యూలైన్‌లోని భక్తులను రెచ్చగొట్టి దర్శనం ఆలస్యమవుతోందని చెప్పించడం, రాజకీయ ప్రయోజనాల కోసం బైట్లు తీసుకుని ప్రచారం చేయడాన్ని ఆక్షేపిస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. 'వేసవి సెలవులకు తోడు వారాంతం కూడా రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వచ్చారు. అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం టీటీడీ యంత్రాంగం, శ్రీవారి సేవకులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అసత్య కథనాల కోసం ప్రయత్నించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది' అని పేర్కొంది.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# పదిలమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తున్నానని, ఈ విజయం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సత్కరించారు. అధికారులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుచేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గరిష్ఠంగా 595 మార్కులు రాగా.. 31 మంది విద్యార్థులు 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 376 మంది విద్యార్థులకు 550కు పైగా మార్కులు వచ్చాయని అదేవిధంగా 1,557 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరని పేర్కొన్నారు. పదో తరగతి విజయాన్ని ఒక మొదటి మెట్టుగా భావించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. విద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని.. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలిగారని అభినందించారు. జిల్లా అభివృద్ధికి విద్యార్థులే చోదకశక్తులని పేర్కొంటూ, పోటీ ప్రపంచంలో ముందుండేందుకు లక్ష్యాలను చేరుకునే వరకు విశ్రమించకుండా పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో సాంబశివరావు, సమగ్రశిక్ష ఏపీసీ రమేష్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ సెక్రటరీ ఉమర్ అలీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి






**పేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం: మంత్రి**

**క్యాంటీన్‌లో స్వయంగా ఆహారం వడ్డించిన మంత్రి, కలెక్టర్**

**ప్రజలతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించిన మంత్రి, కలెక్టర్**

**బనగానపల్లె/నంద్యాల, మే 02:-** పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాతో కలిసి మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ క్యాంటీన్ ప్రారంభించామన్నారు. సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు ఉపశమనం కలిగించే విధంగా అన్న క్యాంటీన్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండేలా శుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం మంత్రి మరియు జిల్లా కలెక్టర్ స్వయంగా పేద ప్రజలకు ఆహార పదార్థాలను వడ్డించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సామాన్య ప్రజలతో కలిసి భోజనం చేసి, అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు క్యాంటీన్ సదుపాయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

# వడ్డెర వద్దు వడియ రాజు ముద్దు



**నంద్యాల ప్రతినిధి. మే 02 . (నంది పత్రిక ):**నంద్యాల వడ్డెర వద్దు ఒడియా రాజు ముద్దు సూర్య వంశం ఒడియ రాజులు శనివారం ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ విలేకరులతో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్ల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. చల్లా వెంకటేష్ విలేకరులతో మాట్లాడుతూ వడ్డెరలు అన్ని రంగాలలో రాణించాలని వడ్డెరలకు రాజకీయ నాయకులు కూడా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బండ కింద పడి మరణిస్తున్న కూడా ఏ ప్రభుత్వము కూడా స్పందించడం లేదని అన్నారు. పేదలకు బండలిపించి బతుకులు బాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు డిమాండ్ చేశారు. బండ మీద ఉన్న నమ్మకంతో ఈ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో కొందరు నేరుగా వచ్చి ఒక్కరోజు ఆలస్యంగా అంటే నిన్న కూడా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుకుంటున్నా. ఈ సమావేశంలో మన్మదాసు సంపంగి మద్దిలేటి సంపంగి జమ్ములు గొడ్డేళ్ల శంకరు మహిళలు తదితర వడ్డెర కులస్తులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేశారు.

# కొలిమిగుండ్లలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం





**సొంత నిధులతో రూ. 9 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు**

**ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**ప్లాంట్ నీటిని స్వయంగా రుచి చూసి నాణ్యత పరిశీలించిన మంత్రి, కలెక్టర్**

**సేవా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమం అభినందనీయం: కలెక్టర్ రాజకుమారి గణియా**

**బనగానపల్లె/నంద్యాల, మే 02(నంది పత్రిక):-** ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యమని రోడ్లు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన మరియు నాణ్యమైన తాగునీటిని అందించడమే ఈ ప్లాంట్ ఏర్పాటు లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధమైన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి, కలెక్టర్ ఇద్దరూ స్వయంగా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన మంచినీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, మంత్రి గారు తన సొంత నిధులు రూ. 9 లక్షలతో ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సొంత నిధులతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 4న రాజనగరంలో గ్రామసభ: టిడిపి నేత అడుసుమల్లి.



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని రాజానగరం గ్రామంలో మే 4 సోమవారం రాజనగరం గ్రామంలో పోలీస్ శాఖ వారు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు అడుసుమల్లి సుబ్బారావు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించే పౌరుల పాత్ర, సైబర్ నేరాల పై అవగాహన, రహదారి భద్రత, బాల్య వివాహాల నిషేధం, అక్రమ బహిరంగ మద్యపాన నిషేధం, మరియు మహిళల కోసం ప్రవేశపెట్టిన చట్టాలపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆడుసుమల్లి సుబ్బారావు తెలియజేశారు. సోమవారం ఉదయం పది గంటలకు సిరివెళ్ల పోలీస్ వారు నిర్వహించే గ్రామ సభను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చట్టాలపై అవగాహన చైతన్యం పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# దేశవ్యాప్త గ్యాస్ ధరల పెంపుపై నిరసన

## - కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక!



**నంద్యాల ప్రతినిధి. మే 02 . (నంది పత్రిక ):**దేశవ్యాప్తంగా కోట్లాది మంది సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను గ్యాస్ ధరల పెరుగుదల అతలాకుతలం చేస్తోందని కాంగ్రెస్ కమిటీ నంద్యాల టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య అన్నారు. ప్రభుత్వం చెప్పే సాకులు దేశ ప్రజల ఆకలిని తీర్చవు. "గతంలో సామాన్యుడికి అందుబాటులో ఉన్న సిలిండర్ ధరను నేడు వేయి రూపాయలు దాటించి, సబ్సిడీని నామమాత్రం చేయడం దేశ ప్రజలను వంచించడమే!" ధరల పెంపును వెంటనే రద్దు చేయాలి: పెంచిన గ్యాస్ ధరలను వెనక్కి తీసుకుని, దేశవ్యాప్తంగా పాత ధరలనే అమలు చేయాలి. సబ్సిడీ పునరుద్ధరణ: గ్యాస్ సబ్సిడీని సామాన్యుడికి ఉపయోగపడే విధంగా పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి. అంతర్జాతీయ కారణాలను సాకుగా చూపి, దేశ ప్రజల జేబులను గుల్ల చేయడం ఆపాలి. దేశంలోని ప్రతి గడప నుంచి వస్తున్న ఈ ఆవేదనను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి. లేనిపక్షంలో, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోరాటాలు తప్పవు!

# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన అశ్రిత జెరూషా ను అభినందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )**ఇటీవల విడుదలైన 2026 ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి (ఎస్.ఎస్.సి) పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో నంద్యాల పట్టణం 33 వ వార్డు టీడీపి ఇంచార్జి జోసఫ్ కుమార్తె అశ్రిత జెరూషా అసాధారణ ప్రతిభ కనబరిచారు. మొత్తం 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించి, ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అశ్రిత జెరూషాను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి, పట్టుదలతో చదివి 594 మార్కులు సాధించడం అభినందనీయం అని అన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అశ్రిత నిరూపించిందని తెలిపారు . భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించి, తల్లిదండ్రులకు, నంద్యాల పట్టణానికి మంచి పేరు తీసుకొనిరావాలన్నారు

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ అశ్రిత జెరూషా ను అభినందిస్తూ, ఆమె ఉన్నత చదువులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. తమ కుమార్తె విజయం పట్ల తండ్రి జోసఫ్ మరియు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, మంత్రి ఫరూక్ గారికి మరియు ఫిరోజ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్ పాల్గొన్నారు

# బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ.

## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )** పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా ఉంటుందని, సీఎం చంద్రబాబు నాయుడు కూడా పేద రోగులను దృష్టిలో పెట్టుకొని సీఎం రిలీఫ్ కు ఎంపీ గా తాను సిఫారసు చేయగానే అవసరమైన నిధులు విడుదల చేయడం అభినందనీయమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల బొమ్మలసత్రం లోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకట కృష్ణారెడ్డి కి రూ. 1,51,616 లు, నంద్యాల ఎస్ బి ఐ కాలనీకి చెందిన శివశంకవ రెడ్డికి రూ. 132,620 లునంద్యాల పట్టణం నడిగడ్డకు చెందిన ఎస్. మహబూబ్ బాషా కు రూ. 35,900 లు, గోస్పాడు మండలం దీబగుంట్ల కు చెందిన వై. ఓబులేసుకు రూ. 35914 లు, ఆళ్ళగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం, ఎరగుడిదిన్నె గ్రామానికి చెందిన ఎన్. తిక్క నవసమ్మ కు రూ. 42000 లు, కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఎం. ననాగ లింగమ్మ కు రూ. 32,324 లు, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన సయ్యద్ షాహిదాకు రూ. 30514 లు, దొర్నిపాడు గ్రామానికి చెందిన సి. ఈశ్వరమ్మ కు రూ. 143490 లు, నంద్యాల నీలివీధికి చెందిన నాగ లక్ష్మమ్మ కు రూ. 60,000 లు, కర్నూలు శారదా నగర్ కు చెందిన జి. నార్దిని కి రూ. 40810 ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. మా వినతిని మన్నించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు వెంటనే విడుదల చేసినందుకు, నిధుల విడుదలకు కృషి చేసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి భాధితులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు ఉన్నారు.



# విరామ బైబిల్ పాఠశాల ర్యాలీ..

**చాగలమర్రి మే 2నంది పత్రిక** వేసవి సెలవులలో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా మండల కేంద్రమైన చాగలమర్రిలోని కూలూరు రోడ్డులో ఉన్న సీయోను ప్రార్థన మందిరంలో దైవ సేవకుడు దావీదు ఆధ్వర్యంలో విరామ బైబిల్ పాఠశాల ప్రారంభించారు. వారికి ఆధ్యాత్మిక చింతన తో పాటు, విద్య, వైజ్ఞానిక , సాంస్కృతిక , సామాజిక అంశాలతో పాటు మెదడును పదును పెట్టే విధంగా రంగురంగుల బొమ్మలను, చిన్నపిల్లలచే విబిఎస్ టీచర్లు వేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు, కిషోర బాల,బాలికలు, వి బి ఎస్ టీచర్లు, వాలంటీర్లు , సంఘ సభ్యులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రార్థన మందిరం నుండి ప్రారంభించిన ర్యాలీ, పెద్ద మఖానం, గాంధీ సెంటర్, మెయిన్ బజార్ వీధుల గుండా కేరళ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించి, వాయిద్యాలతో పాటలు పాడుచు విరామ బైబిల్ పాఠశాల పిల్లలను ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి పలువురు పాల్గొన్నారు.



# పెళ్లి వేడుకలో విషాదం..

**డ్యాన్స్ చేస్తూ హఠాత్తుగా మృతి చెందిన వైసీపీ కార్యకర్త ప్రదీప్..**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.**



**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )** చాపిరేవుల గ్రామంలో ఈనెల 29 వ తేదీ ఓ ఇంట్లో పెళ్లి బాజాలు మోగుతు న్నాయి.. అందరూ నవ్వుతూ, తుళ్ళుతూ గడుపుతున్నారు. తన స్నేహితుడి పెళ్లి వేడుకలో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న ఎద్దుల ప్రదీప్ ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలిసి పోయాయి. గుండెపోటు రూపంలో మృత్యువు కబళించడంతో చాపి రేవుల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన వైసీపీ కార్యకర్త ప్రదీప్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నేడు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రదీప్ కేవలం ఒక కార్యకర్త మాత్రమే కాదు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో ఒక సభ్యుడు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివి" అని కొనియాడారు. చిన్న వయసులోనే ప్రదీప్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కష్టకాలంలో ఆ కుటుంబాన్ని ఒంటరిగా వదిలేయబోమని, తాను వ్యక్తిగతంగానూ, పార్టీ పరంగానూ ఎల్లవేళలా అండగా ఉంటానని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భరోసా ఇచ్చారు.



# గంగ అధికారులు ఏం చేస్తున్నట్లు?

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 2:** ఒకరోజు కాదు రెండు రోజులు కాదు, ఏకంగా పది రోజుల నుండి యదేచ్చగా ఎర్రమట్టిని తెలుగంగ ప్రధాన కాలువ ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరి ఇంత యదేచ్చగా కాలువ పైనుండి అధిక లోడుతో టిప్పర్లు వెళుతూ ఉంటే గంగాధికారులకు ఈ విషయం దృష్టికి రాలేదా? ఒకవేళ దృష్టికి వచ్చిన ఏమీ తెలియనట్టు నటిస్తున్నారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. బండి ఆత్మకూరు మండలంలో తెలుగు గంగ ప్రధాన కాలువ నుండి టిప్పర్ వెళ్తూ ఉండగా శుక్రవారం సాయంత్రం అదుపుతప్పి కాలువలోకి వెళ్ళిపోయింది. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో మట్టి మాఫియా బాగోతం అంతా వెలుగు చూసింది. ఈ విషయాన్ని తెలుగంగ కాలువపై యదేచ్చగా మట్టి రవాణా అన్న శీర్షికన నంది పత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ విషయాన్ని గుర్తించిన మట్టి మాఫియా దార్లు రాత్రికి రాత్రే తమ గుడారాన్ని ఎత్తేశారు. శనివారం తెల్లవారుజామున మట్టి త్రవ్వే ప్రాంతంలో ఉన్న మూడు ప్రొక్కు లైనర్లను, టిప్పర్లను నంద్యాల ప్రాంతా నికి తరలించారు. ఈ విష యాన్ని గుర్తించిన తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ చెన్నారెడ్డి గారి సంజీవరెడ్డి శనివారం సంబంధిత తెలుగు గంగ ఎస్ ఇ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డి ఈ లతో మాట్లాడడం జరిగింది. జరిగిన సంఘటనపై విచారించి తెలుగంగ కట్టలను కూడా పరిశీలించమని ఆదేశించడం జరిగింది. వారం రోజుల నుండి మట్టి మాఫియా యదేచ్చగా కాలువల పైనుండి టి ప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుంటే గంగాధికారులు కళ్ళు తెరవలేదు. పైగా పగలు వద్దు రాత్రి ముద్దు అన్న రీతిలో వ్యవహరించారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. రాత్రిపూట మట్టి తోలుకుంటేఇలాంటి ఇబ్బందులు ఉండవని తెలుగు గంగ కు చెందిన ఓ అధికారి మట్టి మాఫియా అభయాస్త మించినట్లుగా ప్రచారం ,జరుగుతుంది. తెలుగుగంగ చైర్మన్ ఆదేశాలతో హడావిడిగా వచ్చిన గంగ అధికారులు కృష్ణనంది ప్రాంతంలో కాలువలో టిప్పర్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. తర్వాత ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు మహానందికి వెళ్లారు. కాలు వలో టిప్పర్ పడిన సంఘ టనకు సంబంధించి తమ పరిధిలోకి రాదని మహానంది పోలీసులు చెప్పడంతో, అక్కడినుండి వెనతిరిగిన గంగ అధికారులు శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశారు.

## వారే మూసుకున్నారు! మీరెంత!

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 2:** రాజకీయ శక్తుల అండదండలతో బండి ఆత్మకూరు మండలంలో ఇద్దరు వ్యక్తులు అధికార యంత్రాంగాన్ని శాసించే స్థాయికి చేరుకున్నారు. మూడు దశాబ్దాల కాలం నుండి మండలంలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ చోటుచేసుకుని విధంగా జరుగుతూ ఉండటం చర్చనీయాంశమవుతూ ఉంది. వారం రోజులుగా మండలంలో మట్టి మాఫియా దార్లు చెలరేగిపోతు ఉండడంతో ఈ విషయం కొందరు అటవి అధికారులు దృష్టికి వచ్చింది. కొందరు అటవీ సిబ్బంది ఈ విషయంపై మట్టి మాఫియా దారులను అడ్డగించే ప్రయత్నం చేశారు. అడ్డగించాల్సిన వారే మూసుకొని కూర్చున్నారు. మీరెంత అంటూ అటవీ సిబ్బంది పైనే హుంకరించినట్లుగా సమాచారం. తెలుగు గంగ కట్టలపై ఓవర్ లోడ్ టిప్పర్లు వెళితే భవిష్యత్తులో కట్టలు బలహీన పడే ప్రమాదం ఉందంటూ అటవీ సిబ్బంది వారితో వాదించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మీకు ఎలాంటి అధికారాలు లేవు. మూసుకొని ఇక్కడి నుంచి దయచేయండి అంటూ మాఫియా దారులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తుంది. దీని బట్టి చూస్తే మాఫియా దార్లకు రాజకీయ అండదండల ప్రమేయం బాగానే ఉన్నట్లు ఉందని, ఆ కారణంగానే మాఫియాదారులు మధ్య మధ్యలో విరామాలు ప్రకటిస్తూ మట్టిని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతూ ఉన్నట్లుగా బోగట్టా! వీరి ఆగడాలకు జిల్లా కలెక్టర్ కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.



## గుడారం ఎత్తేసిన మట్టి మాఫియా

## రాయల్టీని అడ్డంగా పెట్టుకుని.....

మట్టి మాఫియా దారులు రాయల్టీని అడ్డంగా పెట్టుకొని చెలరేగిపోతున్నారు. రాయల్టీని చెల్లించేముందు మైనింగ్ శాఖకు చెందిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించాల్సి ఉంది. ఈ విషయాన్ని పరిగణంలోకి తీసుకోకుండా మైనింగ్ శాఖకు చెందిన అధికారులు ఏదో వచ్చిందే చాలంటూ రాయల్టీకి సంబంధించిన సొమ్మును తీసుకొని రసీదు ఇచ్చి పడేస్తున్నారు. దీన్ని అడ్డంగా పెట్టుకొని ఎవరు అడిగినా మేము రాయల్టీ చెల్లించే మట్టిని తోలుకుంటున్నామని బహిరంగంగానే చెబుతున్నారు. రాయల్టీ చెల్లించామని చెబుతున్నప్పటికీ ప్రధాన రహదారుల ద్వారా ఇప్పట్లో వెళ్లకుండా తెలుగుగంగ కాలువపై వెళ్లాల్సిన అవసరం ఏముందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధిక లోడుతో తిప్పలు వెళుతూ ఉండటం వల్ల, భవిష్యత్తులో కాలువ కట్టలు తెగిపోతే రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం 50 నుండి 60 టిప్పర్ల లోడుతో మట్టి వెళ్లడం వల్ల కాలువ కట్టలు దెబ్బతిని ఉంటాయని రైతులు అంచనాలు వేసుకుంటున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులు పంటలు వేసుకునే పరిస్థితులలో తెలుగు గంగ కాలువలో నీటి సామర్థ్యం పెరిగిపోయి కాలువకు గండ్లు పడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాల్వకు గండ్లు పడి రైతులు అపార నష్టాన్ని చవి చూస్తే, ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా అంటూ కూడా రైతులు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో తెలుగు ప్రధాన కాలువల మీదుగా ఎలాంటి వాహనాలు తిరగకుండా అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

## ఎమ్మెల్యే ఆశయానికి తూట్లు

మట్టి మాఫియాదారులు చెలరేగిపోతూ రైతుల వనరులను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారు. వేసవిలో డిస్ట్రిబ్యూటరీలు, కాలువలను, పటిష్టం చేసే విధంగా వాటికి మరమ్మత్తులు చేయించి రైతులకు సరైన నీటి వసతులు కల్పించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గత రెండు నెలల కాలం నుండి అధికారులతో ప్రణాళికలను సిద్ధం చేయించారు. ఈ నేపథ్యంలో మట్టి మాఫియా దారులు కాలువ కట్టలను బలహీనపరిచే విధంగా మట్టిని తరించే వైనం ఆందోళన కలిగిస్తూ ఉంది. ఎమ్మెల్యే రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తూ ఉంటే, కొందరు వ్యక్తులు అక్రమార్జనకు పాల్పడి ఎమ్మెల్యే ఆశయాలకు తూట్లు పడేవిధంగా ప్రవర్తిస్తున్నారని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# విద్యార్థినికి అభినందన



**చాగలమర్రి, మే 02, (నంది పత్రిక):-** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు ఎవరెస్ట్ అధిరోహించే అవకాశాన్ని కల్పించింది. ఎవరెస్ట్ అధిరోహణ కార్యక్రమానికి ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని అధిరోహించిన చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన కు ఆదివారం పాఠశాలలో ఘన సన్మానం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జీవయ్య కీర్తనతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రతిభను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు



**జూపాడుబంగ్లా మే 2 (నంది పత్రిక)** మే డే స్ఫూర్తితో కార్మిక వర్గ సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని శనివారం మండల కార్యదర్శి నర్సింహులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రానికి ముఖ్యఅతిథిగా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికా, చికాగోలో కార్మికులు కు పని గంటలు తగ్గించాలని ప్రారంభమైన ఉద్యమం కార్మికుల హక్కుల కోసం ప్రపంచ వ్యాప్తంగా చట్టపరమైన హక్కులకు దారి తీశాయని వివరించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మేడే ను జరుపుకోవడం గొప్ప చేయమన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా మార్చడం ద్వారా పని భద్రత, కనీస వేతనం, సమ్మె హక్కు వంటి కీలక హక్కులను బలహీనపరిచిందని లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు రాయి మీద ఉపాధి హామీ పని కల్పించాలని కోరారు. ప్రభుత్వల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు నూర్జహాన్, బి లక్ష్మీదేవి, వేల్పుల రాణమ్మ, నవసాని, పి. మణికుమారి, శిరీష, జిల్లా పార్టీ నాయకులు నరసింహులు, వేల్పుల ఏసన్న, లింగాల శ్రీనివాసులు, కాటే పోగు సోమన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వంటల రంగంలో కూడా 'ఏఐ'... ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ ఏమంటున్నారంటే...!

దేశంలో అత్యంత ప్రసిద్ధ చెఫ్‌లలో ఒకరైన సంజీవ్ కపూర్, వంటల రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) పెరుగుతున్న పాత్రపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. టెక్నాలజీని చూసి భయపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్ ప్రయాణంలో దానికి అలవాటు పడాలని ఆయన స్పష్టం చేశారు. వంటల రంగంలోకి ఏఐ రాక గురించి మాట్లాడుతూ, "అది ఏఐ అయినా లేదా మరే ఇతర టెక్నాలజీ అయినా, మనం దానికి అనుగుణంగా మారాలి. ఇంటర్నెట్ యుగమైనా, ఏఐ అయినా కొత్తది వస్తూనే ఉంటుంది. మనం దానితో పాటే ముందుకు సాగాలి. కొత్త టెక్నాలజీకి భయపడకుండా, దానితో కలిసి పనిచేయడానికి ప్రయత్నించాలి" అని సంజీవ్ కపూర్ వివరించారు.

# చేతులెత్తి దండం పెడుతున్నాం.. 98 జీవో అమలు చేసి ఉద్యోగాలు కల్పించండి : శ్రీశైలం ముంపు బాధితులు.

## 38 వ రోజు కొనసాగిన నిరాహార దీక్షలు

**నందికొట్కూరు మే 2 (నందిపత్రిక )** 98 జీవో వచ్చి 40 సంవత్సరాలు పూర్తి అయిన ఎన్నో ప్రభుత్వాలు మారినా మా శ్రీశైల ముంపు బాధితుల జీవితాల తలరాత మారలేదని , ఇచ్చిన హామీ ప్రకారం సర్వం కోల్పోయిన ముంపు బాధితులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న రాజకీయ ప్రభుత్వాల హామీలు నెరవేర్చక తీవ్ర అన్యానికి గురి చేస్తున్నారని పట్టించుకునే నాధుడే కరువయ్యారని శ్రీశైలం నీటిముంపు బాధితులు జయన్న ఆవేదన వ్యక్తం చేస్తూ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో శ్రీశైలం ముంపు బాధితులను 98 జీవో అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ చేపడుతున్న దీక్షలో 38వ రోజు పూర్తి చేసుకున్నాయి. దీక్షలో ముంపు బాధితులు జయన్న మాట్లాడుతూ అధికారంలోకి రాక మునుపు టిడిపి పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే 98 జీవో అమలు చేసి ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేస్తానని లక్షలాదిమందిలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అంటూ సీఎం అయిన తర్వాత మర్చిపోవడం ఎంతో బాధాకరమని వారు అన్నారు. ఇకనైనా ప్రభుత్వం శ్రీశైలం నీటిముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. 38వ రోజు దీక్షలో రమాదేవి, యశోద, శైలజ కిరణ్, నారాయణ, నాగేంద్రుడు, కురుమన్న, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



# జలధార పనులను నిబద్ధతతో పూర్తి చేయండి

**జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి రాజంపేట నియోజకవర్గ అధికారులతో జలధార కార్యక్రమం పై సమీక్ష సమావేశం**

**వైఎస్ఆర్ బ్యూరో చీఫ్ కడప, మే 5నంది పత్రిక :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' కార్యక్రమం పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో సబ్ కలెక్టర్ భావనతో కలిసి ఆయన రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, తహశీల్దార్లు , ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.జలధార కార్యక్రమంతో పాటు జనగణన, ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) పనుల పురోగతిపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలలో



గుర్తించిన పనులన్నింటినీ ఉపాధి హామీ పనుల కింద నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువులలో పూడిక పనులను గుర్తించి, ఆ మట్టిని(సిల్ట్ )రైతులు, గ్రామస్తులు ఉచితంగా తీసుకెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు.ఈ అంశంపై అధికారులు గ్రామాల్లో టామ్ టామ్ వేయించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫీడర్ కెనాల్ లలో మళ్లింపు (డైవర్షన్) లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.అదేవిధంగా, ఎంపీడీవోలు ప్రతిరోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల్లో వేగం పెంచేలా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. జలధార యాప్‌లో ఎటువంటి పెండింగ్ లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు.

అంతకుముందు, జిల్లా కలెక్టర్ నందలూరు మండలంలోని లేపాకు చెరువు, మత్రిపల్లి ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి,ఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

## వేల్పనూరులో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పరిశీలన
### అన్ని గ్రామాల్లో అమలు చేయడానికి ఆదేశాలు



**వెలుగోడు, మే 2 (నంది పత్రిక):** జిల్లా పరిషత్ సీఈవో రమణా రెడ్డి శనివారం వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామపంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పూర్తి స్థాయిలో ఆపరేషన్‌లోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం స్వచ్ఛ రథం ద్వారా రోజుకు కనీసం 200 కిలోల పొడి చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. చెత్త వర్గీకరణ, నిర్వహణ ప్రక్రియలను క్రమబద్ధంగా అమలు చేయాలని, గ్రామాల్లో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన సీఈఓ, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలెక్టోరల్ వార్డు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, జలధారజల హారతి కార్యక్రమాలను వేగవంతంగా గ్రౌండింగ్ చేయాలని అన్నారు.అలాగే ఐ వి ఆర్ యస్ కాల్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, సేవపై సంతృప్తి స్థాయిని పెంచాలని సూచించారు. జనగణన పనులను కూడా సిబ్బంది వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి మధుసూదన్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాధవరం హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప జిల్లాబ్యూరో చీఫ్ మే 5నంది పత్రిక :** మాధవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.శనివారం మాధవరంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్ కామన్ ఫెసిలిటీ సెంటర్ (జఖీజ)ను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా క్లస్టర్‌లోని వీవర్స్ షెడ్, డై హౌస్ రూమ్‌లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. క్లస్టర్ అభివృద్ధికి అవసరమైన పనులకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా డై హౌస్ మరియు షెడ్ల ఆధునీకరణ ద్వారా చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, హ్యాండ్లూమ్ అధికారులు , రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రేపు నీట్-యూజీ పరీక్ష: విద్యార్థులూ... ఇవి గుర్తు పెట్టుకోండి!

దేశవ్యాప్తంగా రేపు జరగనున్న నీట్-యూజీ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. నీట్ పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ అమలులో ఉంటుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. ఈ నోటీసు ప్రకారం, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువమంది గుమికూడటం నిషిద్ధం. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. పరీక్ష సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కోరారు.

## రిటైర్డ్ ప్రధానోపాధ్యాయునికి పరామర్శ
### మాజీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డి..




**కలసపాడు, మే 02 (నంది పత్రిక ):**కలసపాడు కు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కారు అబ్రహం(84) ను శనివారం రాష్ట్ర మాజీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయ వృత్తికి కారు అబ్రహం గారు అందించిన సేవలు కొనియాడారు. ఈ వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల యువ నాయకులు కాకర్ల మార్కారెడ్డి, ఉపాధ్యాయ సంఘం జాతీయ నాయకులు పిల్లి రమణారెడ్డి, ఉపాధ్యాయులు బోయిల్ల రోశిరెడ్డి,కారు జోసఫ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## పోరుమామిళ్ల ప్రతిభకు గౌరవం అన్నమాచార్య జయంతి ఉత్సవాల్లో రచయిత బొల్లు రామమోహన్‌కు ఘన సత్కారం



**పోరుమామిళ్ల, మే 02 (నంది పత్రిక ):**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన రచయిత బొల్లు రామమోహన్‌కు విశేష గౌరవం లభించింది. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు వారి 618వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ సంయుక్తంగా నిర్వహించాయి. తెలుగు సాహిత్యం, సంస్కృతికి సేవలందిస్తున్న వ్యక్తులను ప్రోత్సహించేందుకు ఈ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రముఖ సినీ మాటల రచయిత, దర్శకుడు డాక్టర్ రాజేంద్ర కుమార్ పైడిపాటి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్, ప్రముఖ ప్రవచనకర్త బైలూరి యోగేశ్వర ప్రభు, తెలంగాణ సాంస్కృతిక అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్ బాలాచారి తదితరులు పాల్గొని బొల్లు రామమోహన్ రచనా ప్రతిభను ప్రశంసించారు. తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని కొనియాడుతూ సభలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ రచయితలు, కవులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కిషోర్ బాలికలకు వారి హక్కుల గురించి వివరిస్తున్న సంరక్షణ అధికారి దర్గయ్య.



**బేతంచెర్ల మే 2 ( నందిపత్రిక ).**కిషోర్ బాలికలకు వారి హక్కులు చట్టాలపై అవగాహన అవసరం అని సంరక్షణ అధికారి దర్గయ్య అన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి సమాజంలో కిశోర బాలికలకు వారి హక్కులు మరియు చట్టాలపై అవగాహన చాలా అవసరం అని సంరక్షణ అధికారి దర్గయ్య అన్నారు. బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామంలో కిషోర్ బాలికలకు కిశోర వికాసం-2026 వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ అధికారిని మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారిని డోన్ ఐసిడిఎస్ సిడిపిఓ శంషాద్ బేగం ఆదేశాల మేరకు సిమెంట్ నగర్ గ్రామంలో సూపర్వైజర్ తిప్పమ్మ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంరక్షణ అధికారి కిషోర్ బాలికలతో మొదటి సెషన్ పరిచయ కార్యక్రమం నిర్వహించి వారికి వారి యొక్క వ్యక్తిగత భద్రత అవగాహన హక్కులు వాటి విషయాలపై వివరించారు. అలాగే అమ్మాయిలకు చిన్న వయసులో అనగా 18 సంవత్సరాల లోపు వివాహం చేయకూడదని అబ్బాయిలకు ఇరవై ఒక్క సంవత్సరంలోపు వివాహం చేయకూడదని చూపించారు. ఈ విషయాలు చట్ట విరుద్ధమని ఒకవేళ బాల్యవివాహాలను చేసిన ప్రోత్సహించిన వారికి రెండు సంవత్సరాల జైలు జరిమాల కూడా ఉంటుందని ఈ విషయాలు అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరం అని ఆయన అన్నారు. ఒకవేళ మీరు ఉన్న నివాస ప్రాంతంలో కానీ తెలిసిన స్థలాల్లో కానీ బాల్యవివాహాలు జరుగుతుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అంజమ్మ సహాయకురాలు సాలమ్మ ఆయా ప్రాంతంలోని కిషోర్ బాలికలు ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సీఎం సహాయ నిధి కింద చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 2:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన పలువురికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరులో బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన కరిమెద్దెల రామిరెడ్డికి 37,900 రూపాయల చెక్కును పంపిణీ చేశారు. వంశీధరకు 37,114 రూపాయలు, షేక్ కొట్టాల సలీం భాషకు 40 వేల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఏ కోడూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం యువ నాయకుడు వడ్డు మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందజేస్తున్న చెక్కులను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా సూచించారని వడ్డు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఘనంగా ఉరుసు మహోత్సవం..
### ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ





**చాగలమర్రి మే 2 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలోని కట్ట మీది దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం శనివారం ఉరుసు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరయ్యారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులాలకు మతాలకు , వర్గాలకు, పార్టీలకు అతీతంగా ఉరుసు మహోత్సవంలో పాల్గొనడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కడప నంద్యాల ,కర్నూలు జిల్లాల నుండి భక్తులు హాజరవుతారని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆన్సర్ భాష, మౌలాలి, కొలిమి హుస్సేన్ వలి, కొలిమి షరీఫ్, కొరిమి మహబూబ్ బాషా, కొలిమి మాబు సున్న, దర్గా కమిటీ సభ్యులు, భూమా అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## మర్రిపాడు మండలంలో జనగణన ప్రక్రియ ప్రారంభం
### తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్



**మర్రిపాడు మే 2నంది పత్రిక :**మర్రిపాడు మండలంలో జనగణన మొదటి దశ తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్ ప్రారంభించారు.దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన మొదటి దశ ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా, దీని కొరకు ఎన్యూమరేటర్లుగా నియమించబడిన సచివాలయ సిబ్బంది ముందుగా వారికి కేటాయించిన హెచ్ ఎల్ బి లకు సంబంధించిన మ్యాపులు తయారుచేసి, తద్వారా అన్ని గృహాలు మరియు కుటుంబాల వివరాలను ప్రభుత్వం అందించిన యాప్ ద్వారా నమోదు చేయడం జరుగుతుంది.శనివారం నాడు పొంగూరు, మర్రిపాడు మరియు అల్లంపాడు సచివాలయాలను మండల తహసీల్దార్ మరియు సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ అనిల్ కుమార్ యాదవ్ సందర్శించి, మ్యాపుల తయారీ ప్రక్రియను పరిశీలించారు.గృహాల జాబితా ప్రక్రియ ప్రారంభానికి మ్యాపులు అత్యంత ముఖ్యం కావున, అందరూ కేటాయించిన పనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి రెండు రోజులలో మ్యాపుల తయారీ పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిదంగా గృహాల వివరాలు నమోదు చేసే ప్రక్రియను లాంఛనంగా పొంగూరు గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారి రామకిషోర్, సెన్సస్ సూపర్‌వైజర్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## క్రైస్తవుల విశ్వాసం బంగారం లాంటిది



### శతాబ్ది వేడుకలతో కొత్త జీవితం విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల సందేశం

**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )** క్రైస్తవుల విశ్వాసం బంగారం లాంటిది, గత 2వేల సంవత్సరాలుగా క్రైస్తవులు దేవుని పట్ల విశ్వాసంతో జీవిస్తున్నారని విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. శనివారం నంద్యాల మండలంలోని పెద్ద కొట్టాల గ్రామంలో నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రత్నాలు రాసులుగా పోసి అమ్మిన రాయలసీమలో వంద సంవత్సరాలుగా దేవుని విశ్వాసంలో కొనసాగుతున్న గ్రామ ప్రజలను అభినందించారు. ఏసుప్రభు జీవితం కూడా పశువుల కొట్టంలో ప్రారంభమైందనీ, ఈ గ్రామం కూడా మొదట కొట్టాలతోనే ప్రారంభం కావడం విశేషం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాలన్నారు. గతంలో తల్లిదండ్రులంటే పిల్లలకు భయం ఉండేదనీ, ప్రస్తుతం తల్లిదండ్రులే పిల్లలకు భయపడే పరిస్థితులు వచ్చాయన్నారు.శతాబ్ది వేడుకలతో అందరూ సఖ్యతతో మెలిగి కొత్త జీవితానికి పునాది వేయాలన్నారు. కతోలిక సంఘం ఒక్కటే సామాజిక సేవకు కంకణం కట్టు కుందన్నారు. నేడు సామాన్య క్రైస్తవులు సామాజిక సేవలు చేయడం ఆనందదాయక మన్నారు. క్రైస్తవులు సామాజిక సేవలో భాగంగా అడగకముందే సాయం చేయాలన్నారు.తారతమ్య భేదాలు లేకుండా శతాబ్ది వేడుకల్లో పాల్గొనడం శుభపరిణా మన్నారు. మరణించి పునరుత్థానమైన దేవుడు యేసు క్రీస్తు ఒక్కరే అన్నారు. అనంతరం కర్నూల్ డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వానేస్, విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాలను గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. అనంతరం నూరు వసంతాల చర్చి కి సంబంధించిన సావనీర్ ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

**ఘనంగా గ్రామోత్సవం** పెద్ద కొట్టాల గ్రామంలో నూరు వసంతాల జూబ్లీ వేడుకల సందర్భంగా శనివారం సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా తేరును మేళతాళాలతో, తప్పెట్లతో ఊరేగింపు కొనసాగింది. భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ గ్రామోత్సవం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కొనసాగించారు. చర్చి ఫాదర్ రాయపరెడ్డి ఆధ్వర్యంలో ఈ గ్రామోత్సవ తేరును బోరెడ్డి పురుషోత్తం రెడ్డి,యామ మహేశ్వర రెడ్డి,బోరెడ్డి రాజ శేఖర్ రెడ్డి,బోరెడ్డి చైతన్య రెడ్డి,గుండం బాల స్వామి రెడ్డి,పల్లె విజయ శేఖర్ రెడ్డి,ఆరోగ్య స్వామి,బి.ప్రసాద్ రెడ్డి, గోపీ స్వయంగా తయారుచేసి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



## పాపికొండల పర్యాటక బోట్లపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు:

ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పాపికొండల ప్రాంతంలో పర్యాటకుల భద్రతను పర్యవేక్షించేందుకు రంపచోడవరం ఎస్‌డీపీవో అష్రఫ్ ఆలీ శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన బోటు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తమైన పోలీసులు, దేవీపట్నం మండలంలోని బోటు పాయింట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు.

## రాతి దూలం పోటీలు ప్రారంభం..

### పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**చాగలమర్రి మే 2 నంది పత్రిక** చాగలమర్రిలో వెలసిన అత్యంత మహిమ కలిగిన హజరత్ కట్టమీద దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా వృషభములతో బండలాగుడు పోటీలను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం ప్రారంభించారు. రాతిదూలం పోటీలలో గెలుపొందిన వృషభ యజమానులకు బహుమతులను అందజేశారు. బండలాగుడు పోటీలలో వివిధ గ్రామాల నుండి బండలాగుడు వృషభములు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎమ్మెస్అన్సర్ భాష, కొలిమి సోదరులు, అనీఫ్, మౌలాలి, వివిధ గ్రామాల కార్యకర్తలు, భూమా అభిమానులు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా "మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ డే"

**మాదకద్రవ్యాల ను పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా విస్తృత తనిఖీలు.**

**సరైన పత్రాలు లేని 53 వాహనాలు స్వాధీనం .**

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపియస్ గారి ఆదేశాల మేరకు ఈగల్ ఐజి శ్రీ ఆకే రవి కృష్ణ ఐపియస్ గారి పర్యవేక్షణలో, కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీసు సబ్ డివిజన్‌లలో శనివారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు.

**పత్తికొండ సబ్ డివిజన్ –**
దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామం ,
ఎమ్మిగనూరు సబ్ డివిజన్ మాధవరం పీఎస్ పరిధిలో ని– రచ్చు మర్రి గ్రామం ,
ఆదోని సబ్ డివిజన్ – ఇస్వి పీఎస్ పరిధిలో ని కపటి గ్రామం , కర్నూలు సబ్ డివిజన్ – కర్నూల్ ఒకటవ పట్టణ పీఎస్ పరిధిలో ని జోహారాపురం, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు , పోలీసు సిబ్బంది మొత్తం 130 మంది పాల్గొన్నారు.
విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.
1,500 మంది ని తనిఖీలు చేశారు. 165 వాహనాలను తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 53 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక , చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ను పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య, ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి , కర్నూలు ఇన్చార్జి డిఎస్పి ఉపేంద్ర బాబు, సిఐలు, ఎస్సైలు , ఈగల్ టీం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల భద్రత పోలీస్ సత్వర సేవల వినియోగంపై అవగాహన.



**నందికొట్కూరు మే 2( నంది పత్రిక)** పోలీస్ సేవలు మరియు మహిళా భద్రత చట్టాలు , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించినట్లయితే సురక్షితంగా తమ జీవన భద్రతను పెంపొందించుకోవాడానికి అవగాహన అవసరమని ఎస్ఐ నరేంద్ర మహిళలకు సూచించారు. శనివారం పగిడ్యాల మండల కేంద్రంలో ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళలకు రక్షణ చట్టాలు, పోలీస్ సేవలు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ నరేంద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మహిళల భద్రత కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శక్తి వినియోగం, సైబర్ నేరాలపై, ఫోక్సో చట్టం, 100/112 డయల్ నంబర్స్ సేవల వినియోగం పై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి అభద్రత సమస్యలు ఏర్పడిన తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు మహిళలు పాల్గొన్నారు.



# "ప్రజల సేవలో శిల్పా కుటుంబం ఎవరికీ తలవంచదు"



**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి..**

**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )** రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే శిల్పా కుటుంబం లక్ష్యమని, ఆ క్రమంలో తాము ఎప్పుడూ తప్పు చేయమని, ఎవరికీ తలవంచబోమని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని శిల్పా సేవాసమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిల్పా మహిళా బ్యాంక్ ద్వారా 132 మంది మహిళలకు సుమారు 20 లక్షల 19 వేల రూపాయల విలువైన రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తమ ఆకాంక్ష అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ...శిల్పా కుటుంబం చేస్తున్న సేవలపై టిడిపి నేతలు చేసిన విమర్శలపై ధ్వజమెత్తారు.. గత రెండు దశాబ్దాలుగా పేదలు, రైతుల కోసం శిల్పా కుటుంబం పని చేస్తోందని గుర్తు చేశారు. శిల్పా సహకార్ స్టోర్స్‌లో 10% డిస్కౌంట్‌తో సరుకులు అందిస్తుంటే, ఏబిఎన్ చానల్ లో తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో కోట్లాది రూపాయల విలువైన 2 ఎకరాల స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి నెలకు కేవలం వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. సేవ చేయలేకపోతే విమర్శించవద్దని...: "సేవ చేయడం



చేతకాకపోయినా పర్వాలేదు కానీ, చేస్తున్న వారిపై బురద చల్లడం సరికాదన్నారు. మీకు శక్తి ఉంటే మేం చేసే సేవా కార్యక్రమాలను మీకే అప్పగిస్తాం, నిరభ్యంతరంగా కొనసాగించండి" అని సవాల్ విసిరారు. నైపుణ్యాభివృద్ధికి మద్దతు పలుకుతూ.. రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే మరిన్ని స్కిల్ ట్రైనింగ్ కోర్సులు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, బ్యాంకు సిబ్బంది మరియు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## వాణిజ్య సిలిండర్ ధర పెంపుదలను ఉపసంహరించుకోవాలి.సిపిఎం




**ఆత్మకూరు :19** కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై పెంచిన 993.50 రూపాయలఅదనపుఛార్జీనితక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి రామ్ నాయక్, ఏ సురేంద్రలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల నడ్డి విరగ్గొట్టింది. ఇపుడు మరలా అమాంతం దాదాపు మరో వెయ్యి రూపాయలు పెంచి చిన్న వ్యాపారస్తులను, టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లను కోలుకోలేని దెబ్బతీస్తుంది. గ్యాస్ కొరత వలన ఇప్పటికే అనేక హోటళ్లు , టిఫిన్ సెంటర్లు మూతపడ్డాయి లేదా పాక్షికంగా నడుస్తున్నాయి. ఫలితంగా రాష్ట్రంలో వందలాది మంది ఉపాధి కోల్పోయారు. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటివరకు ఆగిన కేంద్ర ప్రభుత్వం మరలా గ్యాస్ రేటు పెంచి వెన్నుపోటు పొడిచింది. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి. ఉపాధి కోల్పోయిన చిన్న చిన్న వ్యాపారస్తులకు, టిఫిన్ సెంటర్లకు ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలి. కేజీ బేసిన్‌లోని గ్యాస్, చమురులో 50% రాష్ట్రానికి ఇవ్వాలి. గ్యాస్, ఆయిల్ బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి. గ్యాస్ రేట్ల పెంపుదలపై ఎక్కడికక్కడ ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని వారు సిపిఎం పార్టీగా కోరారు.

## ప్రసార భారతి చైర్మన్ గా బాలీవుడ్ లిరిక్ రైటర్ ప్రసూన్ జోషి నియామకం

బాలీవుడ్ లిరిక్ రైటర్, కమ్యూనికేషన్ నిపుణుడు ప్రసూన్ జోషి ప్రసార భారతి కొత్త చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాహిత్యం, ప్రకటనలు, సినిమా రంగాల్లో విశేష అనుభవం ఉన్న ప్రసూన్ జోషి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ప్రసూన్ జోషి నియామకంపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు. "ప్రసూన్ జోషికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ఒక అరుదైన సృజనశీలి. ఆయన మాటల్లో భారతీయత ఉట్టిపడుతుంది. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి కొత్త ఉత్తేజంతో, లోతైన లక్ష్యంతో ముందుకు సాగుతుంది" అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకానికి ముందు, ప్రసూన్ జోషి 2017 ఆగస్టు నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్ సీ) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మెక్‌కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా సీఈఓగా, మెక్‌కాన్ ఆసియా పసిఫిక్ చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. ప్రసూన్ జోషి తన కలంతో ఎన్నో అద్భుతమైన పాటలకు ప్రాణం పోశారు. 'రంగ్ దే బసంతి' చిత్రంలోని 'లూకా చుపీ', 'రూబరూ', 'మస్తీ కీ పాఠశాల' వంటి సూపర్ హిట్ గీతాలతో పాటు, 'తారే జమీన్ పర్'లోని 'మా', 'బమ్ బమ్ బోలే' వంటి భావోద్వేగభరితమైన పాటలను ఆయన రచించారు. అలాగే 'ఢిల్లీ–6'లోని 'మసకలి', 'భాగ్ మిల్కా భాగ్'లోని 'జిందా', 'ఓ రంగ్రేజ్', 'ఫనా'లోని 'చాంద్ సిఫారిష్', 'హమ్ తుమ్' టైటిల్ సాంగ్, 'గజిని'లోని 'గుజారిష్', 'నీర్జా', 'మణికర్ణిక' వంటి అనేక చిత్రాలకు ఆయన అందించిన సాహిత్యం ఎంతో ప్రాచుర్యం పొందింది. కాగా, 1990 ప్రత్యేక చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రసార భారతి సంస్థ, 1997 నుంచి భారతదేశంలో ప్రభుత్వ రంగ ప్రసార సేవలను అందిస్తున్న స్వయంప్రతిపత్తి గల సంస్థగా పనిచేస్తోంది.

## నేడే ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీశ్రీబ ప్రారంభించనున్న బుగ్గన అర్జున్ రెడ్డి.



**బేతంచెర్ల మే 2 ( నందిపత్రిక ).** బేతం చెర్ల పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రేపు అనగా (ఆదివారం) 03-5-2026వ తేదీన డోన్ మాజీ ఎమ్మెల్యే రావు బహుదూర్ బీపీ శేషారెడ్డి 141వ జయంతి సందర్భంగా, ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 7:30 గంటలకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు వైఎస్ఆర్సిపి యువ నాయకుడు బుగ్గన అర్జున్ రెడ్డి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. కావున పట్టణ ప్రజలు, యువకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై ఈ టోర్నమెంట్ ను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సంజీవ నగర్ కాలనీలోని బిఎస్.మురళీధర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే వివాహానికి బుగ్గన అర్జున్ రెడ్డి హాజరవుతారని తెలియ జేశారు.

## కేటీఆర్, హరీశ్ రావులపై కాంగ్రెస్ నాయకుల సంచలన ఆరోపణలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ సంచలన ఆరోపణలు చేశారు. కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్లకు టెండర్లు వేసిన వారికి ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాల కారణంగా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు ఆదాయం తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. వివిధ శాఖలు, ప్రాజెక్టులపై అనవసర ఆరోపణలు చేసి కాంట్రాక్టర్లను లొంగదీసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. బ్లాక్ మెయిల్‌కు కేటీఆర్, హరీశ్ రావులు బ్రాండ్ అంబాసిడర్లు అన్నారు.

# ఆపరేషన్ "వజ్రప్రహార్"...

**కర్నూలు నగరంలో మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్.**

**గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం.**

**సరైన పత్రాలు లేని 10 వాహనాలు స్వాధీనం .**




**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపియస్ ఆదేశాల మేరకు ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ ఐపియస్ పర్యవేక్షణలో, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆధ్వర్యంలో జిల్లాలో మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా శనివారం కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోహరాపురం , ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ ప్రాంతాల్లో పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టారు. గతంలో గంజాయి మరియు ఇతర నేరాలలో పట్టుబడిన నిందితుల ఇళ్లు, అద్దె ఇళ్లు, మరియు ఖాళీగా ఉన్న భవనాల్లో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 10 మంది రౌడీ షీటర్లను, ఇద్దరు సస్పెక్ట్ షీటర్లను విచారించారు. సరైనా పత్రాలు లేని 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక , చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ జూూ+హాజు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ను పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో కర్నూలు ఇన్–ఛార్జ్ డీఎస్పీ ఉపేంద్ర బాబు, వన్ టౌన్ సీఐ మారుతీ శంకర్, కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య , కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ విక్రమ సింహా, ఎస్ఐలతో పాటు ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ ఎలిషా , ఈగల్ టీం సభ్యులు, 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# 9.38 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



నంద్యాల సిటీ బ్యూరో మే 02 ( నంది పత్రిక )పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మంచి మనసుకు నిదర్శనమని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంత్రి ఫరూక్ గారి క్యాంపు కార్యాలయంలో (రాజ్ టాకీస్) నందు 9,38,925 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, ,వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు మంత్రి ఫరూక్ కి విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 19 మంది బాధిత కుటుంబ సభ్యులకు వచ్చిన 9 లక్షల 38 వేల 925 రూపాయలను చెక్కుల రూపంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అతి కొద్ది కాలంలోనే 3 కోట్ల 13 లక్షల 73 వేల 455 రూపాయలను 418 మందికి



సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని ఫిరోజ్ తెలియజేశారు .. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియర్ ఖలీల్ , గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి ,

ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్, మాజీ కౌన్సిలర్ కృపాకర్, బుగ్గ రాముడు, గోస్పాడు ఫరూక్ హుస్సేన్ మరియు వార్డు ఇన్చార్జిలో , టిడిపి నాయకులు , కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఇంటి దొంగను పట్టుకున్న నాలుగో పట్టణ పోలీసులు

## 15 తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి వస్తువులు రికవరీ...



కర్నూలు నంది పత్రిక బ్యూరో.... కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్య దేవాలయం వద్ద గల వివేక్ నగర్లో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి నాగేంద్ర అను అతని ఇంటిలో ఏప్రిల్ నెల 21వ తేదీ నుండి 27 వ తేదీ మధ్యలో వారి ఇంటిలోని సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు మరియు 30 తులాల వెండి వస్తువులు కనిపించడం లేదని ఇంటికి తరుచుగా వచ్చే పనిమనిషి గాని లేదా కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చే వ్యక్తి గాని వీటికి కారణం అయి ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4 వ పట్టణ పోలీస్ స్టేషన్ జ× విక్రమ్ సింహ కేసు నమోదు పరిచి దర్యాప్తులో భాగంగా అనుమానితులైన ఇద్దరినీ విచారించి అందులో దొంగతనానికి పాల్పడినది వన్ టౌన్ ఏరియాలో నివాసం ఉంటు ఫిర్యాది ఇంట్లో గత 3 నెలలుగా ఇంటి పని చేస్తున్న పనిమనిషి పర్వీన్ గా గుర్తించి, ఈ రోజున సదరు పనిమనిషిని వారి ఇంటి వద్దనే అరెస్టు చేసి, విచారించి, ఆమె ఇంటిలో దొంగలించబడి దాచుకున్న 15 తులాల బంగారు ఆభరణాలు మరియు 30 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం అయినది. ఇందులో చురుకుగా పని చేసి, రికవరీకి సహకరించిన సుబ్బారాయడు లను మరియు గోపినాథ్, చంద్ర శేఖర్ లను కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అభినందించడం జరిగింది.

# 28వ వార్డులో సింటెక్స్ ట్యాంకుల నీళ్లనే తాగాలి





## పైప్‌లైన్ నీటిని ఇతర అవసరాలకు మాత్రమే వినియోగించాలి

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు నంది పత్రిక బ్యూరో... నగరంలోని 28వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం, పందిపాడు, దూపాడు, అశ్వత్థపురం గ్రామాల ప్రజలు తమ వీధుల్లో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు, మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటినే తాగునీటిగా వినియోగించాలని, పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటిని ఇతర అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. శనివారం ఆయన లక్ష్మీపురం గ్రామంలో నీటి సంగ్రహ బావులు, తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవికాలం కారణంగా హంద్రీ నదిలో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందన్నారు. ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల ద్వారా సేకరించే నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నప్పటికీ, ప్రజలకు మరింత స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హంద్రీ నుంచి నీటి సరఫరా పొందుతున్న ఈ గ్రామాలకు ప్రతిరోజూ ప్రత్యేక మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు వెల్లడించారు. సింటెక్స్ ట్యాంకుల్లో నిల్వ చేసిన నీటినే తాగునీటిగా వినియోగించాలని, ఇంటి అవసరాలు, శుభ్రపరిచే పనులు, ఇతర సాధారణ అవసరాలకు మాత్రమే పైప్‌లైన్ నీటిని ఉపయోగించాలని స్పష్టం చేశారు. అంతకుముందు నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈ నరేష్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంజల్ ప్రణీత, అమినిటీస్ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# జనగణనను సమగ్రంగా నిర్వహించాలి.. ఆర్డీఓ వెంకట శివ

జూపాడుబంగ్లా: మే: 2: (నంది పత్రిక) ప్రతి ఒక్కరూ జనగణ ఎన్యుమరైటర్లు సహకరించాలని ఆర్డిఓ వెంకట శివ అన్నారు. మండల పరిధిలోని తాటిపాడు గ్రామంలో సర్వే తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ వెంకట శివ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ప్రణాళికలు, సమగ్ర అభివృద్ధికి ఖచ్చితమైన గుణంకాలు ఎంతో అవసరమని స్పష్టం



చేశారు. సర్వే ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి నిబంధన ప్రకారం ఎలాంటి అవకతవకలు లేకుండా ఖచ్చితముగా సమగ్రంగా నమోదు చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారి చేశారు. సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా పారదర్శకముగా పనిచేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ అధికారులకు సహకరించి తమకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని కోరారు. జన గణ సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లతో పాటు ఆర్డిఓ వెంకట శివ స్వయంగా గ్రామంలో గృహాలను దర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, డీటీలు సత్యదీప్, ఎన్. నాగన్న, డిప్యూటీ ఎంపీడీవో మోహన్ నాయక్, ఏఎస్ఓ హనుమంతు, పంచాయతీ కార్యదర్శి తిప్పన, ఫాతిమా, మరియు తాటిపాడు, జూపాడుబంగ్లా ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం ఎందుకు..?





## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

## పారిశుద్ధ్య సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలి

## వాణిజ్య దుకాణాల వద్ద 'డస్ట్ బిన్' తప్పనిసరి

కర్నూలు నంది పత్రిక బ్యూరో... పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దని, సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మరోసారి స్పష్టం చేశారు. శనివారం ఆయన 16వ శానిటేషన్ డివిజన్ స్టాంటన్‌పురంలో మస్టర్ తనిఖీ నిర్వహించారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, గణేష్ నగర్, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ కార్యదర్శులు సమయానికి రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు ప్రతిరోజూ ఉదయం 05:30 గంటలకు విధిగా ప్రారంభం కావాలని ఆదేశించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పని వేళల్లో అవసరమైన మార్పులు చేసుకున్నప్పటికీ, ప్రతి సిబ్బంది 8 గంటలపాటు విధులు నిర్వర్తించాల్సిందేనని స్పష్టం చేశారు.

టీ, టిఫిన్ వంటి అన్ని వాణిజ్య దుకాణాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెరుగైన పారిశుద్ధ్యం కోసం ప్రతి వార్డుకు ఒక వాహనం కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలో మరో 10 ట్రాలీలు కొనుగోలు చేసి, వాటిని మార్కెట్ యార్డులు, పూల బజార్ వంటి అధికంగా చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో వినియోగించనున్నట్లు వెల్లడించారు. నగర పారిశుద్ధ్యాన్ని పూర్తి స్థాయిలో గాడిలోకి తీసుకురావాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, హుస్సేన్, ఎంజల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# యాక్సిడెంట్లో చనిపోయిన హుస్సేన్ కు 5 లక్షల రూపాయలు చెక్కు అందజేస్తున్న కోట్ల రాఘువేంద్ర రెడ్డి.

బేతంచెర్ల ఏప్రిల్ 2 (నంది పత్రిక ) బేతంచెర్ల పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన హుస్సేన్ భాష యాక్సిడెంట్ లో చనిపోవడం జరిగింది. హుస్సేన్ భాషకు టిడిపి సభ్యత్వం ఉన్నందువల్ల, యాక్సిడెంట్ లో చనిపోయిన హుస్సేన్ భార్యకు శనివారంనాడు 5 లక్షల రూపాయల చెక్కును డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల



రాఘువేంధ్ర రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల నాగరాజు,పిడతల రూబెన్ , ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కోట్ల రాఘువేంధ్ర రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి, పార్టీ కోసం పాటుపడే నాయకులకు,కార్యకర్తలకు అండగా ఉంటామని వారు అన్నారు. హుస్సేన్ భాష భార్య మాట్లాడుతూ నాకు ఇద్దరు పిల్లలు మేము పేదరికంలో ఉన్నాము. నా భర్త యాక్సిడెంట్లో చనిపోయాడు. నా భర్తకు టిడిపి సభ్యత్వం ఉన్నందువల్ల, ఆక్సిడెంట్లో చనిపోయినందుకు 5 లక్షల రూపాయలు ఇచ్చిన కోట్ల రాఘువేంద్ర రెడ్డి, మేకల నాగరాజు, పిడతల రూబీన్, వారికి మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నానని హుసేన్ బాషతెలిపారు.

# అన్న క్యాంటీన్ల వద్ద మరమ్మత్తు పనులు చేపట్టండి

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు నంది పత్రిక బ్యూరో.... నగరంలో ఉన్న అన్న క్యాంటీన్ల వద్ద అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ప్రభుత్వాసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లోరింగ్ మరమ్మత్తులు, డస్ట్‌బిన్‌ల ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు



జారీ చేశారు. క్యాంటీన్ పరిసరాల్లో స్వచ్ఛత పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, ప్రతిరోజూ రెండు సార్లు స్వచ్ఛత పనులు నిర్వహించాలని, ప్రత్యేకంగా ఒక వర్కర్‌ను కేటాయించాలని ఆదేశించారు. అదేవిధంగా, నిర్వాహకులు తమ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు టేబుళ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ గూఢచారులన్న ఆరోపణలతో ఇద్దరిని ఉరితీసిన ఇరాన్

ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కోసం పనిచేశారన్న ఆరోపణలతో ఇరాన్ శనివారం ఇద్దరు వ్యక్తులను ఉరితీసింది. యాకూబ్ కరీంపూర్, నాసర్ బెకర్జాదే అనే ఈ ఇద్దరికీ సుప్రీం కోర్టు మరణశిక్షను ఖరారు చేయడంతో, న్యాయ ప్రక్రియల అనంతరం శిక్షను అమలు చేసినట్టు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌తో 40 రోజుల పాటు జరిగిన యుద్ధ సమయంలో కరీంపూర్ మొసాద్‌కు చురుకుగా సహకరించినట్టు అధికారులు తెలిపారు. దేశానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని టెలిగ్రామ్ ద్వారా ఒక మొసాద్ అధికారికి చేరవేసినట్లు పేర్కొన్నారు. సైనిక స్థావరాల వద్ద పేలుళ్లు జరపడం, వాటిని చిత్రీకరించడం, భద్రతా సంస్థలను తప్పుదోవ పట్టించడం వంటి పనులకు గాను ఇతను డబ్బులు స్వీకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. మరో దోషి అయిన బెకర్జాదే, ఇరాన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నతాధికారులు, మత పెద్దలకు సంబంధించిన సమాచారం, ఫోటోలు, వీడియోలను వాట్సాప్, ఈమెయిల్ ద్వారా మొసాద్‌కు అందించినట్టు అధికారులు తెలిపారు. దీనికి ప్రతిఫలంగా ఇతను కూడా డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించగా, ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. కాగా, కాంగ్రెస్ అనుమతి లేకుండా ప్రారంభించిన సైనిక చర్యకు 60 రోజుల గడువు ముగియడంతో ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజే ఈ ఉరిశిక్షలు అమలు కావడం గమనార్హం.



# ఫెయిల్ అయిన 10వ తరగతి విద్యార్థులకు 20 రోజుల ప్రత్యేక రెమిడియల్ తరగతులు

### 20 మందికి పైగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కోచింగ్ కేంద్రాల ఏర్పాటు
### విద్యా ప్రమాణాల పెంపుకు సమగ్ర చర్యలు చేపట్టాలి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మే 02(నంది పత్రిక ):-** 10వ తరగతి పరీక్షల్లో అనుతీర్ణులైన విద్యార్థుల కోసం రాబోయే 20 రోజుల పాటు ప్రత్యేక రెమిడియల్ తరగతులు నిర్వహించి, వారందరూ ఉత్తీర్ణులయ్యేలా సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అమరావతి సచివాలయం నుంచి విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఆధ్వర్యంలో "బడి పిలుస్తోంది" కార్యక్రమం, రెమిడియల్ తరగతుల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జూమ్ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 10వ తరగతిలో ఫెయిల్ అయిన 3,743 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి విద్యా లోపాలను గుర్తించి ఉత్తమ విద్యాబోధన అందించాలని డీఈఓ జనార్దన్ రెడ్డిని ఆదేశించారు. కనీసం 20 మంది విద్యార్థులు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత ఉత్తీర్ణత శాతం 84.73గా ఉండగా, ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం 78.24గా నమోదైందని తెలిపారు. ఈ శాతాన్ని వందశాతానికి పెంచే దిశగా కృషి చేయాలని, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అడ్మిషన్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, 5 సంవత్సరాలు పూర్తైన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా మొదటి తరగతిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు బయటకు వెళ్లకుండా ట్రాన్సిషన్ విధానాన్ని



కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా, 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను 'మోడల్ ప్రైమరీ పాఠశాలలు'గా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు మరియు రెమిడియల్ తరగతుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## పర్ల ఆసుపత్రిని తనిఖీ చేసి అభివృద్ధి పనుల పరిశీలించిన అడిషనల్ డిఎం ఇ..& మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ....



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూల్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న కమ్యూనిటీ మెడిసిన్ విభాగము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పర్ల ఆసుపత్రిని అడిషనల్ డీఎంఇ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మరియు కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు అధిపతి వైస్ ప్రిన్సిపల్ డా. సింథియా శుభప్రద లు శనివారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపిని పరిశీలించడం జరిగింది. ఓపి పెంచాలని గతంలో 120 దాకా ఓపి వచ్చేదని సూచించారు. డ్రగ్స్ స్టోర్ ను పరిశీలించిన వారు ఇద్దరు ఫార్మసిస్టులు ఉన్నారని డ్రగ్స్ ఎక్స్పైరీ డేట్ ల గురించి నిరంతరం చెక్ చేసుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆధునికరించిన వార్డును, వాటర్ కనెక్షన్స్ పరిశీలించారు. ఆస్పత్రి గేటు వద్ద బోర్డు పెట్టాలని సంపు యొక్క హైట్ పెంచాలని ఆసుపత్రి స్థలం శుభ్రం చేసేందుకు, హద్దులు నిర్దేశించి చుట్టూ కంచె ఏర్పాటుకు ప్రతిపాదనల సిద్ధం చేయాలని ఇంజనీర్ కు సూచించారు. మెడికల్ ఆఫీసర్ సెలవుల్లో ఉండటంతో సిబ్బందికి పలు సూచనలు చేశారు హాస్పిటల్ ఉదయం తొమ్మిది నుంచి నాలుగు గంటల వరకు నడిపించాలని గతంలో డెలివరీలు కూడా జరిగేవని కచ్చితంగా ఆసుపత్రి సేవలు మరింతగా పెరగాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రసన్న రాణి, డా. వైష్ణవి,ఇంజనీర్ రాజశేఖర్, లెక్చరర్ సురేష్, సూపర్వైజర్ సాయిరాం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సంతృప్తి స్థాయి పెంచుదాం





### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
### 52 వార్డులకు నోడల్ అధికారుల నియామకం

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** రాష్ట్ర ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని పెంచుదామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నూతనంగా నియమితులైన నోడల్ అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 52 వార్డులకు నియమించిన నోడల్ అధికారులే ఆయా వార్డుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. స్వర్ణ వార్డు కార్యాలయాల కార్యకలాపాలు, వార్డుల అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నోడల్ అధికారి తమ వార్డులో పర్యటిస్తూ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై విశ్వాసం, సంతృప్తి స్థాయి మరింత పెరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ఇంచార్జీ సిటీ ప్లానర్ వై. వెంకటరమణ, ఇంచార్జీ మేనేజర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది ::

### కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** వైసీపీ నాయకుడినని చెప్పుకునే సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు నాయుడుకు నారా లోకేష్ కు వార్నింగ్ ఇస్తూ మాట్లాడటాన్ని సోమిశెట్టి వెంకటేశ్వర్లు తప్పు పట్టారు శనివారం కర్నూలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి గతంలో జగన్మోహన్ రెడ్డి సలహా దారుడిగా ఉంటూ ప్రజల సొమ్మును దోచుకున్నావ్ ప్రజలు ఇంకా మర్చిపోలేదని తప్పుడు సలహాలు ఇస్తూ అది నాయకుని తప్పుదోవ పట్టిస్తూ లిక్కర్ మాఫియా ఇసుక భూ దందాలు వాటితో ప్రజల సొమ్మును దోచుకున్నారని అలాంటి మీరు చేసిన పనులను చట్టం దృష్టిలో దోషులుగా నిలిచిచారు. ఏదోరోజు జైలుకెళ్లే సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ గురించి మాట్లాడే అర్హత మీకు ఎక్కడిదని అవినీతి ఆరోపణల గురించి మీ పార్టీ వారే నీ గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారని ఏదోరోజు జైలుకెళ్లే మీరు చంద్రబాబు నాయుడు నారా లోకేష్ గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని వారి గురించి ఎక్కువ మాట్లాడితే రాష్ట్ర ప్రజలు తిరగబడతారని అంతేగాని చంద్రబాబు నాయుడు ఇలాంటి నీచపు రాజకీయాలు చేయడం తెలుగుదేశం పార్టీ కానీ చంద్రబాబునాయుడు కానీ చాలా దూరంగా ఉంటారు అటువంటి వారిపై ఇలాంటి ఆరోపణలు చేయడం సబబు కాదని హెచ్చరించారు మీ పార్టీ వారే తప్పులు చేసుకుంటూ పోతే తెలుగుదేశం పార్టీ వారు చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు తప్ప కక్ష సాధింపులు చేయలేదని మీరు చేసిన తప్పులేకాక నీ కుమారుడిని కూడా పదవిలో కూర్చోబెట్టి ఎన్నో దుర్మార్గాలు సెటిల్మెంట్లు చేస్తూ ఎంతోమంది దగ్గర డబ్బులు సొమ్ము చేసుకున్నారని ఈ ఆరోపణలపై ఏదో రోజు బయటపడుతుందని ఆరోపణలు చేశారని వాటన్నిటికీ కాలమే తగిన బుద్ధి చెబుతుందని మీరు మీ కుమారుడు జగన్మోహన్ రెడ్డి జైలుకెళ్లడం తథ్యమని సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు

# జలధార-జలహారతి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ ఆదేశం

### మిగిలిన జలధార పనులు
### రెండురోజుల్లో పూర్తి చేయాలి
### అధికారులందరూ వివరాలు వెంటనే
### అప్‌లోడ్ చేయాలి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మే 02(నంది బ్యూరో):-** జిల్లాలో అమలవుతున్న 'జలధార - జలహారతి' కార్యక్రమ పనులను వేగవంతం చేస్తూ, ప్రతీ పనిని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా, జలవనరుల శాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార - జలహారతి కార్యక్రమం కింద మంజూరైన 1920 పనులలో ఇంకా వెయ్యి పనులు గ్రౌండ్ కావాల్సి ఉందని... వీటన్నింటినీ రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపిడిఓ లు తప్పనిసరిగా వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 7, 8 తేదీలలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్నందున, ఆలోపే ఈ వివరాలన్నీ యాప్‌లో ప్రతిబింబించాలన్నారు. వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్లకు సంబంధించి గ్రామస్థాయి ప్రణాళికలు ప్రస్తుతం 76% పూర్తయ్యాయని, మిగిలిన 24% పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన పనులు 86% పూర్తయ్యాయని, మిగిలిన 14%



పనులను ఆదివారం లోపు పూర్తి చేయాలన్నారు సంబంధిత పనుల పురోగతిపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. కొత్తపల్లె మరియు ఆత్మకూరు మండలాల్లో యూనిఫైడ్ సర్వే నెమ్మదిగా సాగుతోందని ఆదివారం లోగా రేపటికల్లా మెరుగుపడకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఆదేశించారు.

## ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం: బైకులు ధ్వంసం.. చర్యలు శూన్యం!



**సిరివెళ్ల (నంది పత్రిక)** నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బాధ్యతారాహిత్యం సిరివెళ్లలో చర్చనీయాంశమైంది. ఈ నెల 29న నంద్యాల నుండి పెద్దకంబలూరు వెళ్తున్న ఏపీ 21 z 0710 నంబర్ గల బస్సు, డ్రైవర్ బి.బి. భాస్కర్ అతివేగంగా నడపడం వల్ల రోడ్డు పక్కన ఆపి ఉంచిన రెండు బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు పదిహేనువేల రూపాయల నష్టం వాటిల్లగా, ప్రమాదం తర్వాత డ్రైవర్ బస్సును ఆపకుండా వెళ్ళిపోవడం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, బాధ్యుడైన డ్రైవర్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. పోలీసు శాఖవారు డ్రైవరు గారితో సంప్రదించినా అతని నుండి ఎటువంటి స్పందన లేకపోవడం చాలా శోచనీయం అని బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిపో ఎం.ఎస్, ఆర్.ఎం స్పందించి తక్షణ విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని సిరివెళ్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఖాళీ భూమి కనిపిస్తే చాలు భూకబ్జాలకు పాల్పడుతున్న టిడిపి నాయకులు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ పొలిమేరలో ఉన్న సమాధులపల్లెలో కోట్ల విలువైన గ్రామకంఠం భూమిని టిడిపి నాయకులు కబ్జాయత్నాన్ని అడ్డుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డిబస్తిపాడు గ్రామ పొలిమేరలో ఉన్న సమాధులపల్లె గ్రామ కంఠంను సందర్శించి పరిశీలించిన కాటసాని రామభూపాల్ రెడ్డి అనంతరంకాటసాని రామభూపాల్ రెడ్డి గ మాట్లాడుతూ ఖాళీ భూమి కనిపిస్తే చాలు భూకబ్జాలకు పాల్పడుతున్న టిడిపి నాయకులు.గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా కేటాయించిన కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేయడానికి ప్రయత్నించిన టిడిపి నాయకులను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి టిడిపి నాయకులు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డ కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ దౌర్జన్యాలు, అక్రమ కబ్జాలను ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరిక..వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే కబ్జా చేసిన భూములను ప్రజలకే తిరిగి అందిస్తామని హామీ.కబ్జాదారులకు వత్తాసు పలికే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రజల ఆస్తులను కాపాడటం మా బాధ్యత, కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవని ఘాటైన హెచ్చరిక చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో కల్లూరు మండలం నాయకులు బస్తిపాడు కల్లా వెంకటరమణారెడ్డి , పెద్దపాడు శ్రీధర్ రెడ్డి , పుసులూరు రామకృష్ణారెడ్డి ,కేశవరెడ్డి ,రెమడూరు నారాయణరెడ్డి , చిన్నటేకూరు ఈశ్వరయ్య , పెద్దటేకూరు హనుమంత రెడ్డి , ఉలిందకొండ ఏవి రమణారెడ్డి , మార్కాపురం మద్దిలేటీగారు, చాంద్ భాషా , పందిపాడు శివ శంకర్ రెడ్డి , లక్ష్మీపురం సత్యం రెడ్డి , వైఎస్ఆర్సిపి మాజీ కార్పొరేటర్లు నారాయణరెడ్డి , దండు లక్ష్మి కాంత్ రెడ్డి , మరియు అక్కిమి హనుమంత రెడ్డి , సాయి కృష్ణ , మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..



## భక్త జన సందోహంతో కిక్కిరిసిన శ్రీ మద్దిలేటయ్య దేవస్థానం.



**బేతంచెర్ల ఏప్రిల్ 2 (నందిపత్రిక )** బేతంచర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం, లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం శనివారం నాడు భక్తులతో కిక్కిరిసిపోయింది. వైశాఖ మాసం శనివారంతో పాటు, వేసవికాలము సెలవులు రావడంతో, వివిధ జిల్లాల నలుమూలల నుంచి,పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి, శ్రీ ఘన మద్దులేటి స్వామి,శ్రీ మహాలక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు గండ దీపాలు మోసి, వారి వారి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్& దేవ స్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.రామాంజనేయులు తగు దర్శన,వసతి సౌఖర్యాలను పర్యవేక్షించారు. వసతి సౌఖర్యాలపై తగు చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు దేవ స్థాన సిబ్బంది కార్యక్రమాలలో పాల్గొన్నారు.



# శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలి



## -డీఎస్పీ భార్గవి
## -రచ్చమర్రి లో ఆపరేషన్ వజ్ర పహార్..

**మంత్రాలయం, న్యూస్** :శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి కోరారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు మేరకు శనివారం మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఆపరేషన్ వజ్ర పహార్ లో భాగంగా విస్తృత స్థాయి కార్డన్ సెర్చ్ ను డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో మంత్రాలయం సీఐ .దస్తగిరి బాబు ,కోసిగి సీఐ మంజునాథ్ , మాధవరం ఎస్సై విజయ్ కుమార్, కోసిగి ఎస్సై . రమేష్ రెడ్డి లు సిబ్బంది తో కలిసి మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రచ్చుమర్రి గ్రామంలో ఆపరేషన్ వజ్ర పహార్లో భాగంగా విస్తృత స్థాయి కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ, సోదాల్లో భాగంగా అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద షాపులు, అక్రమ మద్యం విక్రయాలు, గుట్కా నిల్వలు వంటి అంశాలపై ప్రత్యేక తనిఖీలు చేశామన్నారు. అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్ల ఇళ్లలో తనిఖీలు చేసి వారికి అక్కడే కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సోదాల్లో రికార్డులు సరిగాలేని 11, నంబర్ ప్లేట్ లు లేని 8 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.అనంతరం గ్రామ ప్రజలు, మహిళలు గ్రామంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే మహిళల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో బెల్ట్ షాపులు, నాటుసారా తయారీ వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. పంట పొలాల్లో గంజాయి సాగు చేయడం మరియు

గంజాయి విక్రయాలు చేయడం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అంతే కాకుండ గ్రామములో గొడవలు సృష్టించే వారిపై రౌడీ షీటర్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామములో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



**సిరివెళ్ల(నంది పత్రిక)**ఆదర్శ పాఠశాల శిరివెళ్ళలో పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఇష్రత్ బేగం, ఉపాధ్యాయులు పద్మశ్రీ మరియు షావలి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రథమ ర్యాంకును సాధించిన నాగ చైతన్య సాగర్ (573 మార్కులు), ద్వితీయ ర్యాంకును సాధించిన వెన్నెల (569 మార్కులు), తృతీయ ర్యాంకును సాధించిన పి. రాజలక్ష్మి (560 మార్కులు) విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి, శాలువాలు మరియు మొమెంటోలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.పాఠశాల సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగొందాలని ఆకాంక్షించారు. ఆదర్శ పాఠశాల శిరివెళ్ళ విద్యా ప్రమాణాలకు ఇది మరో నిదర్శనమని వారు పేర్కొన్నారు.

# సాగునీటి వనరుల పై మంత్రి ప్రత్యేక ద్రుష్టి

## తిమ్మానాయిని పేట చెరువు నీటి సామర్థ్య పెంపునకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

## మంత్రి పర్యటనలో జిల్లా ఉన్నత అధికారులు





**బనగానపల్లె మే 2నందిపత్రిక** బనగానపల్లె నియజకవర్గంలో రైతులకు సాగునరందించే చెరువు ల పై మంత్రి బీసి జనార్దన్ రెడ్డి ప్రత్యేక ద్రుష్టి పెట్టారు. శనివారం సంజామల మండలం తిమ్మానాయిని పేట చెరువు ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా తో కలిసి పరిశీలించారు.ఈ చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని చిన్న నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి సూచించారు.అనంతరం గతంలో ఆక్రమణలకు గురైన జుర్రేరు వాగు పరిసరాలను మంత్రి పరిశీలించారు. ఈ సమయంలో జిల్లా రెవెన్యూ ఉన్నత అధికారులకు వాగు విస్తీర్ణం ఆక్రమణలకు గురై ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అక్కడినుండి బనగానపల్లె చేరుకొని పాత ఎమ్మార్వో (ప్రస్తుత ఆర్డీవో) కార్యాలయ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అదే సమయంలో బనగానపల్లె కార్పెంటర్ కాలనీలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆయన వెంట ఉన్నారు.అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# టిడిపి సీనియర్ నాయకుడు కమతం లక్ష్మి రెడ్డిని పరామర్శించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కమతం లక్ష్మిరెడ్డికి గత కొన్ని రోజుల క్రితం బైక్ యాక్సిడెంట్ లో కాలు ఫ్రాక్చర్ జరిగింది. అయితే ఆరోజు అందుబాటులో లేనందున శనివారం నాడు ఎర్రగుంట్ల గ్రామానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేరుకొని కమతం లక్ష్మిరెడ్డిని పరామర్శించింది. తదానంతరం ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, జయరాం రెడ్డి, శీలం ప్రసాద్, సూరి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా పారువేట ఉత్సవం



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో జరుగుతున్న ఈశ్వరస్వామి తిరునాల్ల మహోత్సవంలో భాగంగా శనివారం వైభవంగా పారువేట ఉత్సవం జరిగింది. ఆలయ పురోహితులు లాల్బహుదూర్ శాస్త్రీ ఉత్సవమూర్తుల విగ్రహాలకు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకిలో వేయించింపజేసి గ్రామ పురవీధుల వెంట పల్లకిసేవ ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఉత్సవమూర్తుల పల్లకిని గ్రామ పొలిమేరలోని పొలాల్లోకి తీసుకువెళ్లారు. అక్కడ పారువేట గొర్రెను విడిచిపెట్టారు. పారువేట గొర్రెను పట్టుకొనేందుకు యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన పక్కాగా నిర్వహించాలి.

## -సమయపాలన పాటించాలి - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి - నంది పత్రిక:** సచివాలయ సిబ్బంది గ్రామాలలో చేపట్టినటువంటి జనగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. శనివారం మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, ఎదురుపాడు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లను తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు. జనగణన నిర్వహిస్తున్న సమయంలో వివరాలను తప్పులు దొర్లకుండా ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.

# చంద్రబాబు నాయుడు ఏ రోజు కూడా కక్ష సాధింపు చేయలేదు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుపోవు ప్రభాకర్



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** వైసిపి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డి నోటికి వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని పదవులు ఉన్నాయన్న అహంకారంతో అనేక మందిని అక్రమ అరెస్టులు చేశారని మేము చేస్తున్నది అక్రమ అరెస్ట్ లుకాదు సక్రమ అరెస్ట్ లు, చట్టపరమైన అరెస్టులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకే పోగు ప్రభాకర్( కోడుమూరు నియోజకవర్గం )అన్నారు శుక్రవారం రోజు సజ్జల మాట్లాడిన రెచ్చగొట్టే వ్యాఖ్యలకు కౌంటర్ గా కర్నూల్ టీడీపీ కార్యాలయం లో మాట్లాడం జరిగింది. సజ్జల అసలు మీ పార్టీలో నీ అర్హత ఏంటో నీకె తెలీదు మీ జగన్ రెడ్డి అధికారం లో ఉన్నప్పుడు బీసీ లు అయినటువంటి మా నాయకులు అచ్చం నాయుడు ని, కొల్లు రవీంద్ర ని, మా కార్యకర్తలు నీ అక్రమంగా అరెస్ట్ చేసారని కానీ మా టీడీపీ ప్రభుత్వం లో చట్టపరంగా అరెస్ట్ లు జరుగుతున్నాయి అని, మీ పార్టీ వళ్ళు సాక్షాత్తు న్యాయం చెప్పే జడ్జి ల మీద కూడా నీచమైన పోస్టు పెట్టారు, హైకోర్టు జడ్జి లే తప్పు బట్టరాని ఇలా రెచ్చగొట్టే మాటల వల్లే మీకు జనాలు చీదరించుకొని పదకొండు సీట్లు ఇచ్చారాని, మీరు అధికారం లో రావడం ఇక కలే, నోరు అదుపులో పెట్టుకోక పోతే తగిన శాస్తీ చెప్తాము అని మా నాయకులు చంద్రబాబు, లోకేష్ బాబు ని అంటే ఊరుకోనేది లేదు త్వరలో నీ అక్రమాలు బయటికివస్తున్నాయి నువ్వు జైలు కి వెళ్తావ్ అని మీ పార్టీ గోడకు కొట్టిన బంతి కాదు శాశ్వతం గా లేవలేని పార్టీ అని మాట్లాడటం జరిగింది

# అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**బనగానపల్లె మే 2నందిపత్రిక** అతి తక్కువ ధరతో పేదలు తమ ఆకలి తీర్చుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటిన్ ను బనగానపల్లెలో మంత్రి బీసి జనార్దన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అతన్నత అధికారి కలెక్టర్ రాజకుమారి గనియా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, తెలుగుదేశం నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రారంభం అనంతరం మంత్రి కలెక్టర్ అక్కడ భోజన పదార్థలను రుచి చూస్తూ భోజనం చేశారు.

# హనుమంతగుండంలో జలధార-జలహారతిని ప్రారంభించిన మంత్రి



**కొలిమిగుండ్ల మే 2నందిపత్రిక** కొలిమిగుండ్ల మండలం హనుమంతగుండం గ్రామంలో శనివారం మంత్రి బీసి జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ తో కలిసి జలధార-జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారుకార్యక్రమం కింద జలధార-జలహారతిలో భాగంగా పెద్ద చెరువు ఫ్రీడర్ చానల్ పూడికతీత కార్యక్రమము చేపట్టనున్నారు ముందుగా కార్యక్రమానికి వచ్చిన మంత్రి, కలెక్టర్ కు గ్రామస్తులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి పలుగు పార పట్టి.. మట్టిని తవ్వారు.అక్కడున్న ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి చెరువు బాగు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు మీరు బాగు చేసేది కేవలం చెరువు మాత్రమే కాదు.. భావితరాల భవితకు మీ శ్రమ ద్వారా ఇచ్చే భరోసా అని వారితో అన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.

# శ్రీ నారాయణ స్కూల్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్ రవితేజష్.



**బేతంచెర్ల మే 2 (నందిపత్రిక )** బేతంచెర్ల మండల పరిధిలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో బేతంచెర్ల మండల టాపర్ గా ఆర్ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన పి.రవితేజష్ నిలిచాడు.బేతంచెర్ల మండలంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల కంటే, బేతంచర్ల శ్రీ నారాయణ స్కూల్ లో చదివిన విద్యార్థి పబ్బిశెట్టి.రవితేజష్ 587/600 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచాడు. ఈ విద్యార్థికి తల్లిదండ్రులు రంగస్వామి, రమ్యశ్రీ మరియు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు

## -జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రాంపురం గ్రామంలో రూ. 82.70 లక్షలతో పనులకు శంకుస్థాపన
## -90వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్..
## -పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి



**మంత్రాలయం, మే 2,** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందివ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి తెలిపారు.శనివారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో రూ. 82 లక్షల 70 వేల రూపాయలతో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ మరియు పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాణ్యత ప్రమాణాలు కూడిన పనులను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బీమా రెడ్డి , జిల్లా కార్యదర్శి పి మురళీ మోహన్ రెడ్డి , గ్రామీణాభివృద్ధి శాఖ మండల ఇంజనీర్ తిమ్మరాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శింగరయ్య స్వామి తిరుణాల లో ప్రముఖులు...

**కలసపాడు మే 2 (నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా కలసపాడు మండలం బ్రాహ్మణ పల్లె సమీపం లోని శ్రీ శింగరయ్య స్వామి తిరుణాల శనివారం వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుణాల లో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, రాజంపేట అన్నమాచార్య బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్ బసిరెడ్డి జయరామిరెడ్డి, ఉపాధ్యాయు సంఘం జాతీయ నాయకులు పిల్లి రమణారెడ్డి, ఉపాధ్యాయులు బోయిల్ల రోశిరెడ్డి, కారు జోసఫ్ ప్రవీణ్ కుమార్,పిట్టికుంట కు చెందిన సీడ్ ఆర్గనైజర్ బసిరెడ్డి వెంకట రామిరెడ్డి,చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు...



# రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

## -సీఐ దస్తగిరి బాబు

**మంత్రాలయం, మే 2,** రోడ్డు ప్రమాదాలు జరగకుండా, సైబర్ నేరాలు, ఐవిఆర్ ఎస్ కాల్స్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సీఐ దస్తగిరి బాబు సూచించారు. శనివారం మంత్రాలయం మండల పరిధిలోని చెట్నెహళ్ళి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పోలీసు సిబ్బంది తో కలిసి ఏర్పాటు చేశారు.



# విద్యాభారతి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన 'ఆచార్య ప్రశిక్షణ' శిబిరం




**నంద్యాల సిటీ బ్యూరో మే 2 ( నంది పత్రిక )**

విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను 'ఆచార్యులు'గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 15 రోజుల 'ఆచార్య ప్రశిక్షణ' శిబిరం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, విద్యా రంగ ప్రముఖులు విచ్చేసి ఆచార్యులకు దిశానిర్దేశం చేశారు.భారతీయ సనాతన ధర్మాన్ని, సంస్కృతిని నేటి తరానికి అందిస్తూ, విద్యార్థులను మేటి పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యాభారతి సంస్థ చేస్తున్న కృషి అమోఘమని పలువురు వక్తలు కొనియాడారు. విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 రోజుల 'ఆచార్య ప్రశిక్షణ' (ఉపాధ్యాయ శిక్షణ) శిబిరం శనివారం స్థానిక ప్రాంగణంలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది.

**కార్యక్రమ ముఖ్యాంశాలు:**

**సాంప్రదాయం – క్రమశిక్షణల మేళవింపు:** కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు మాట్లాడుతూ, కుటుంబాలను వదిలి సుదూర ప్రాంతాల నుండి శిక్షణకు విచ్చేసిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. సాధారణ ప్రైవేట్ విద్యాసంస్థలకు, విద్యాభారతికి మధ్య ఉన్న ప్రాథమిక వ్యత్యాసాన్ని వివరిస్తూ.. విద్యాభారతి కేవలం చదువును మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంస్కారాన్ని నూరిపోస్తుందని స్పష్టం చేశారు. నూతన విద్యా విధానం ఆశయం మేరకు విద్యార్థులు స్వయం సమృద్ధి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

**విద్యార్థి వికాసానికి 'పంచపది' మార్గం:** కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కన్నా భాస్కర్ ప్రశిక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ.. గతంలో 40 రోజులు, ఆ తర్వాత 20 రోజులు జరిగిన ఈ శిక్షణను ప్రస్తుతం 15 రోజులకు కుదించినప్పటికీ, దీని ద్వారా అందే జ్ఞానం అపారమని పేర్కొన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక, మరియు ఆధ్యాత్మిక వికాసం కోసం విద్యాభారతి ప్రత్యేకంగా రూపొందించిన 'పంచపది' బోధనా పద్ధతిని ఆచార్యులు క్షుణ్ణంగా నేర్చుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 176 పాఠశాలలతో పాటు, మారుమూల వనవాసి ప్రాంతాల్లో, సముద్ర తీర గ్రామాల్లో 'ఏకోపాధ్యాయ' పాఠశాలల ద్వారా విద్యాభారతి అజ్ఞానపు చీకట్లను తొలగిస్తోందని ఆయన వివరించారు.

**ఆచార్యుడు – ఆదర్శప్రాయుడు:** ముఖ్య వక్త డా॥ దాస్మురి ఉమామహేశ్వరరావు తన ప్రసంగంలో ఆచార్యుల బాధ్యతను గుర్తు చేశారు. "ఉపాధ్యాయులు అందరూ ఆచార్యులు కాలేరు; ఏ వ్యక్తి అయితే తాను చెప్పే విషయాన్ని స్వయంగా ఆచరించి చూపిస్తారో వారే నిజమైన ఆచార్యులు" అని ఆయన స్పష్టం చేశారు. రామకృష్ణ పరమహంస జీవితంలోని సంఘటనను ఉదహరిస్తూ, పిల్లవానికి తీపి తినవద్దని చెప్పే ముందు పరమహంస స్వయంగా ఆ అలవాటును మానుకుని ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. 1200 ఏళ్ల పరాయి పాలనలో మన సంస్కృతిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరిగిందని, దానిని పునరుద్ధరించే బాధ్యత నేటి ఆచార్యులపై ఉందన్నారు.

**క్రమశిక్షణే పునాది:** నంద్యాల మాజీ పార్లిమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, విద్యాదానమే మహోన్నతమైన దానమని, ఒక వ్యక్తి విద్యావంతుడైతే ఆ కుటుంబం మొత్తం ప్రగతి పథంలో నడుస్తుందని తెలిపారు. నేటి సమాజంలో క్రమశిక్షణ లోపిస్తోందని, విద్యాభారతి పాఠశాలలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని ఆకాంక్షించారు.

**శిక్షణ లక్ష్యాలు:** శిక్షణలో భాగంగా ఆచార్యులు ఈ క్రింది అంశాలపై దృష్టి సారించాలని వక్తలు సూచించారు: జ్ఞానం,నైపుణ్యాలు మరియు సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలి.

ఆధ్యాత్మికత : 15 రోజుల శిక్షణ ముగిసేలోపు 33 శ్లోకాల 'ఏకాత్మతా స్తోత్రం' మరియు విద్యాభారతి లక్ష్యాలను కంఠస్థం చేయాలి. నైతికత : విద్యార్థుల్లోని అసుర గుణాలను (అహంకారం, ఆడంబరం) తొలగించి, దైవ గుణాలను నింపాలి. సాంకేతికత & సంప్రదాయం: ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే భారతీయ సాంప్రదాయాన్ని విస్మరించకూడదు.

**శ్రీ రామకృష్ణారెడ్డి క్లుప్త ప్రసంగం** వేదికపై ఉన్న




పెద్దలకు మరియు శిక్షణకు విచ్చేసిన ఆచార్య బంధువులకు నమస్కారం.కుటుంబాలను వదిలి, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ మహత్కార్యం కోసం ఇక్కడికి వచ్చిన మీ అందరికీ హృదయపూర్వక స్వాగతం.

గుర్తుంచుకోవాల్సిన మూడు ముఖ్య అంశాలు:

ఆచార్యుడే ఆదర్శం: విద్యాభారతి అంటే కేవలం పుస్తక పాఠాలు కాదు, విలువల పాఠాలు. సాధారణ పాఠశాలలకు, మనకూ ఉన్న తేడా మన 'సంస్కారం'. విద్యార్థికి పాఠం చెప్పే ముందు, మనం ఆచరించి చూపాలి. అప్పుడే మనం నిజమైన 'ఆచార్యులం' అవుతాం. స్వయం సమృద్ధి: నూతన విద్యా విధానం లక్ష్యం విద్యార్థి తన కాళ్ళ మీద తాను నిలబడటం. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారిని స్వతంత్రులుగా తీర్చిదిద్దే బాధ్యత మనదే. ఏకాగ్రతతో శిక్షణ: ఈ 15 రోజులు మీ మనస్సును నిగ్రహించుకుని, ఓపికతో శిక్షణలో పాల్గొనండి. ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని మీ పాఠశాలల్లో అమలు చేసి, విద్యాభారతి ఆశయాలను నెరవేర్చాలని కోరుకుంటున్నాను. మీ అందరి ప్రశిక్షణ విజయవంతంగా పూర్తి కావాలని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.




# వాణిజ్య గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి.




**కేసముద్రం, మే 02(నంది పత్రిక):**కేంద్ర ప్రభుత్వం పెంచిన వాణిజ్య గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ అధిక ధరలను అరికట్టవలసిన కేంద్ర ప్రభుత్వం, ప్రజలపై పెను భారం మోపుతుందన్నారు. ఈ సంవత్సరం కేవలం ఐదు నెలల లోనే 6 సార్లు గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల అనంతరం వాణిజ్య గ్యాస్ ధరలు పెంచడం వలన హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాళ్లు మూతపడే ప్రమాదం ఉందని, దీంతో వాటిపై ఆధారపడ్డ కార్మికులు, యాజమాన్యం జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన ధరల వల్ల గ్రామాల్లోని చిన్న హోటళ్లు మూతపడ్డాయన్నారు. గ్యాస్ ధరల పెంపు వలన టిఫిన్, టీ, భోజనం రేట్లు పెరిగి సామాన్య ప్రజలపై భారం పెరిగి జేబులకు చిల్లు పడుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలిస్తూ సామాన్య ప్రజలపై ధరల భారం మోపడం మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా ఉందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్గొండ వెంకన్న, ఎస్.కె మౌలానా, ఉప్పలయ్య, వెంకన్న, ఎస్ కే జిలాని, పాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 6న కేటీఆర్ రైతు సదస్సును విజయవంతం చేయాలి.

## మాజీ ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్ పిలుపు



**మహబూబాబాద్, మే 02(నంది పత్రిక):**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న భారీ రైతు సదస్సును విజయవంతం చేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు, రైతులకు భరోసా కల్పించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు, మద్దతు ధర లేక అల్లాడుతున్న అన్నధాతల గళాన్ని వినిపించేందుకు ఈ వేదిక అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుండి రైతులు, బిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలి పిలుపునిచ్చారు.రైతు సమస్యలే అజెండా: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టడం, రైతు బంధు, రుణమాఫీ వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఐక్యత చాటాలి: బిఆర్ఎస్ ఎల్లప్పుడూ రైతు పక్షపాతి అని, ప్రజల హక్కుల కోసం కేటీఆర్ నాయకత్వంలో ఐక్యంగా పోరాడాలని శంకర్ నాయక్ కోరారు. ఈ సదస్సు ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు తమ పరిధిలోని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి, వాహన ఏర్పాట్లతో సదస్సుకు హాజరు కావాలని సూచించారు.

# జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ వజ్రపహార్






**కార్యక్రమంలో భాగంగా నేర నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ....**

**అనుమానితులు, నేర చరిత్ర గలవారు,రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు.....**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక...**

**నంద్యాల క్రైం, మే02(నంది పత్రిక):=**నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేర నియంతరణ,శాంతిభద్రతల పరిరక్షణ, మాదకద్రవ్యాల నియంతరణ లక్ష్యంగా మరియు ప్రజల రక్షణ వారి భద్రతకు భరోసా కల్పించేందుకు ఆపరేషన్ వజ్రపహార లో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు సబ్ డివిజన్ పోలీస్ అధికారుల సూచనలతో పోలీస్ అధికారులు ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.

**ఆపరేషన్ వజ్రపహార్ నిర్వహించిన ప్రదేశాలు**

1.ఆత్మకూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏకలవ్య నగర్, లక్ష్మీ నగర్ ,పద్మావతి నగర్, వెంగల్రెడ్డి నగర్, నల్లకాలువ గ్రామం వదలకు ప్రదేశాలు.

2. డోన్ సబ్ డివిజన్ అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం గ్రామం 3. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిలకుంట్ల గ్రామం . మొదలగు ప్రాంతాలలో ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ఆపరేషన్ లో సరైన ధ్రువపత్రాలు లేని పలు మోటార్ సైకిల్ లకు జరిమాన విధించడంతోపాటు అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తులను అరెస్టు చేసి బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ నేరాలను ముందస్తుగా అరికట్టి గ్రామాలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై నిఘా కొరకు, ప్రజల రక్షణ వారి భద్రతకు పోలీసులు ఉన్నారనే భరోసా కల్పించడం మరియు ప్రతి చోట పోలీసుల నిఘా ఉంటుందని సుస్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించవచ్చునని, మరియు నిషేధిత వస్తువుల రవాణా మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంతో ఈ సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీ షీటర్లు,మరియు నేర చరిత్ర గలవారి ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగిందని, రౌడీషీటర్లకు నేరచరిత్ర గల వారికి అక్కడే కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్నారులపై జరిగే నేరాలు, బాల్యవివాహాలు మరియు సీసి కెమెరాల ప్రాధాన్యత మొదలగు వాటిపై అవగాహన కల్పించడంతో పాటు పోలీసు వారి తక్షణ సహాయం కొరకు 100/112 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి పోలీసు సహాయం పొందవచ్చునని తెలియజేయడం జరిగింది.

# ముదిరాజ్ ల వాటా ఎటు పోతుంది?

## బీసీ-డి నుండి బీసీ-ఏకు మార్చే అంశం పత్రాలకే పరిమితమా?

## మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్



**కేసముద్రం, మే 02(నంది పత్రిక):** కేసముద్రం పట్టణ కేంద్రంలో మెపా కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శి కొండ సురేష్ ముదిరాజ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ముదిరాజ్ లే అధికంగా ఉన్నారనీ, జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముదిరాజ్ లకు రావాల్సిన వాటా ఎటుపోతుంది, ముదిరాజ్ లను బీసీ డి నుండి బీసీ ఏ కు మారుస్తామని ఇచ్చిన హామీనీ ఎటు పోయిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో పార్టీలకతీతంగా ముదిరాజ్ రిజర్వేషన్ కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శి కొండ సురేష్ ముదిరాజ్, శాగంటి శ్రీనివాస్, సిరికొండ శ్రీకాంత్, కొండ పాపారావు, సిరికొండ అనిల్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.



# నేను మీలో ఒకడినే - జిల్లా న్యాయమూర్తి డాక్టర్ .బి . లక్ష్మీనారాయణ



**భీమవరం బ్యూరో చీఫ్ మే 2నంది పత్రిక** "శ్రామికుని చెమట వాసన, దాని విలువ తనకు తెలుసని, కార్మికుని హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, మండల న్యాయ సేవా సంస్థ కట్టుబడి వున్నాయని, ప్రభుత్వం అందజేస్తున్న ఈ-శ్రమ్, ఇన్సూరెన్సు, పెన్షన్ వంటి పథకాలను అందరూ నమోదు చేసుకోవాలని, ఎటువంటి న్యాయపరమైన సమస్యలున్నా సంస్థను సంప్రదించాలని, రాజ్యాంగపరంగా కార్మిక హక్కులు కల్పించబడ్డాయన్నా, ఓటు హక్కు వచ్చినా, నిర్బంధ విద్యా హక్కు వచ్చినా అది రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి ఫలితమేనని, కార్మికులు అమ్ముడుపోకుండా తమ సమస్యలను తీర్చగలిగే సరైన నాయకుని ఎన్నుకోవాలని, కార్మికులు తమ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని, చదువుకుంటే చరిత్రపై అవగాహన వస్తుందని, చరిత్ర తెలిసినవాడు క్రొత్త చరిత్రను లిఖిస్తారని అంబేద్కర్ అన్నారని" భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి. లక్ష్మీనారాయణ అన్నారు.

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శనివారం సంస్థ ఆధ్వర్యంలో భీమవరం మునిసిపల్ ఆఫీసులో పారిశుద్ధ కార్మికులతో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహనా సదస్సులో జిల్లా న్యాయమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొని పలు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మికులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఎ . శ్రీలక్ష్మి వివరించారు. భీమవరం మునిసిపల్ కార్మికులకు వర్తింపజేసిన పథకాల గురించి సమగ్ర నివేదికను అందజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ ఎ . రాంబాబు కార్మికుల సంక్షేమానికి మునిసిపాలిటి కట్టుబడి ఉందని, కార్మికులకు వారి అర్హత, సీనియారిటీలను బట్టి పదోన్నతులు ఉంటాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ మాట్లాడుతూ కార్మికులు ఆదాయానికి మించి అధిక వడ్డీకి అప్పులు చేయరాదని, అప్పుల భారంతో కుటుంబాలు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి . సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి . హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్ . జ్యోతి, 1వ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం నాగరాజు, ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, వెంకటరమణ, సురేష్ కుమార్, ఉష, అమూల్య, పద్మ, మహిమా జ్యోతి, సునీత, సానిటరీ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణరాజు, సూర్యనారాయణరాజు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో అత్యధిక మార్కుల పొందిన టాప్ 30 విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అభినందన సన్మానం






## విద్యార్థి దశ నుంచే వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 2నంది పత్రిక** ప్రతి విద్యార్థి నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దానిని సాధించడానికి అవసరమైన పనులు, సమయం, వనరులను సద్వినియోగం చేసుకుంటూ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగితే విజయాన్ని తప్పక సాధించగలరని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం కలెక్టరేట్ కార్యాలయం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శనివారం 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్స్ గా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులతో విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టాప్ టెన్‌లో నిలిచిన 30 మంది విద్యార్థులను అభినందించి మెమొంటోలు అందజేశారు. యలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన అంబటి జయశ్రీ, ఎస్.పి.ఆర్.ఎస్ జడ్పీ పి హైస్కూల్ విద్యార్థిని 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందినందుకు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ప్రతి విద్యార్థి అంకితభావంతో, ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, సాంకేతికతతో కూడిన వినూత్న బోధన పద్ధతులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. చిన్న వయస్సు నుంచే భావవ్యక్తీకరణ, వినడం, ఆలోచన శక్తి వంటి లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలపై అపోహలు విడనాడి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను గుర్తించాలని తల్లిదండ్రులకు సూచించారు. పేదలకు విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను కూడా ముందుకు తీసుకురావడంలో ప్రభుత్వ పాఠశాలలు కృషి చేస్తున్నాయని తెలిపారు. “తల్లికి వందనం” పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున జమ చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో గోడలు, మరుగుదొడ్లు, ఆటస్థలాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం కీలకమని పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఘనత పశ్చిమగోదావరి జిల్లాకే దక్కిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో సహపంక్తి భోజనం అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## స్వంత ఖర్చులతో 10 ఏళ్ల తాగునీటి సమస్యకు ముగింపు పలికిన కౌన్సిలర్.

### కాలనీవాసుల ప్రశంసలు పొందిన 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమ రవి.



**కేసముద్రం, మే 02(నంది పత్రిక):**కేసముద్రం మున్సిపల్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి శాశ్వత పరిష్కారం చూపించారు. ఎన్నో సంవత్సరాలుగా స్థానిక ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతూన్న పలువురు నేతలు హామీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ ఉమారవి సమస్యను తన భుజాల మీద వేసుకుని, స్వంత ఖర్చుతో నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చైతన్య నగర్ కాలనీలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉండగా, ఈ చర్యతో వారి దాహార్తి తీర్చబడింది. స్థానిక ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు. గతంలో హామీలే వినిపించాయి, కానీ ఇప్పుడు నిజంగా సమస్య పరిష్కారం అయ్యిందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సమ్మి గౌడ్ చిలువేరు.



**కేసముద్రం, మే 02(నంది పత్రిక):**కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామం చంద్రు తండాకు చెందిన బానోత్ కైక- బిక్ష(లేటు)ల కుమారుడు గణేష్ వివాహం వధువు స్రవంతితో జరుగగా గోపా డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండేలా దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని కోరుకుంటూ వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు అందజేసి అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ వెంట భూక్య శ్రీనివాస్ నాయక్, బానోత్ అశోక్ నాయక్, లకావత్ మనోజ్ కుమార్, మాలోత్ భాస్కర్, భానోత్ రాజు, గుగులోత్ లింగా, భూక్య భాస్కర్, చంద్రుతండా యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 2నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో నమోదు మరియు కోర్సుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికత వినియోగం రోజురోజుకు కీలకమవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు ఐగాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న శిక్షణా కోర్సులను పూర్తిచేసి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రతినెల కనీసం మూడు కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మొత్తం 14,992 మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో 10,371 మంది ఇప్పటికే పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ఇంకా 4,621 మంది నమోదు కావాల్సి ఉన్నదని తెలిపారు. మిగిలిన ఉద్యోగులు వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత కోర్సులను త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ పోర్టల్ ద్వారా ఉద్యోగులు ఆధునిక పరిపాలనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, సేవల అందింపు విధానాల్లో మెరుగుదల సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించేందుకు సాంకేతికత వినియోగం కీలకమని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు సమీక్ష సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరు అయినట్లయితే సంబంధిత అధికారులపై పరిపాలనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలకు ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అన్ని శాఖాధికారులు తమ పరిధిలోని సిబ్బంది ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో నమోదు మరియు కోర్సుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఓ శివపార్వతి, యు.మంగపతిరావు, గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్యతో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు..



## పిడిఎస్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు వర్కర్లకు, పాదాచార్లకు కూల్ డ్రింక్స్ పంపిణీ

**కేసముద్రం, మే 02(నంది పత్రిక):**కేసముద్రం మున్సిపల్ పరిధిలో అధిక ఎండ వేడిలో పనిచేస్తున్న కార్మికులకు, పాదాచారులు, ప్రజలకు ప్రయాణీకులకు ముఖ్యంగా రోడ్డు వర్క్ చేస్తున్న ప్రజలకు పిడిఎస్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూల్ డ్రింక్స్, వాటర్, పంపిణీ చేశారు.



## మహిళాల భద్రతకు 24/7 ఫిర్యాదు చేసే విధానం గురించి అవగాహన కల్పించిన షీ టీం

**కేసముద్రం, మే 02 (నంది పత్రిక):** మహబూబాబాద్ జిల్లా ఎస్పి డా.పి.శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ షీ టీం కేసముద్రం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం షీ టీం మహిళల భద్రత గురించి ఉప్పరపల్లి, బిచ్చ తండా, సప్పిడి గుట్ట తండా, అమీనాపురం గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న మహిళా కూలీల భద్రతను దృష్టిలో ఉంచుకుని షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై సునంద, వారి సిబ్బంది మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మహిళల భద్రత, అలాగే పని ప్రదేశాలలో జరిగే దోపిడీ, వేధింపులు, మోసపూరిత చర్యల గురించి వివరించారు. షీ టీం ఎస్సై మహిళలకు వ్యక్తిగత భద్రతా చర్యలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, పోలీస్ సహాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళలు తమ హక్కులను తెలుసుకొని, ఎటువంటి వేధింపులు ఎదురైనా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు డయల్ 100/112, మహబూబాబాద్ షీ టీం నెంబర్:8712656935 ఇతర అత్యవసర సేవలు సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరాలు తెలిపారు. గ్రామ స్థాయిలో సమిష్టి సహకారంతో భద్రతా వాతావరణాన్ని సృష్టించుకోవాలని, మహిళల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు 550 మంది ఉపాధి హామీ వర్కర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ సుధాకర్, అరుణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.







## క్రీడలు అంటే ప్రాణం న్యాయవాది కాకర్ల రమేష్ చౌదరి

### షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన న్యాయవాదికాకర్ల రమేష్ చౌదరి - ఎస్సై శ్రీకాంత్

**దొర్నిపాడు మే 2 నంది పత్రిక** మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అవసరం అలాంటి క్రీడలు అంటే నాకు ప్రాణం అని సీనియర్ టిడిపి నాయకుడు న్యాయవాది కాకర్లరమేష్ చౌదరి అన్నారు మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో 5 ,6, 7 తేదీల్లో జరిగే తిరుణాల సందర్భంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే దృక్పథంతో మండల స్థాయి సెటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎస్ఐ శ్రీకాంత్ ,రమేష్ చౌదరి శనివారం ప్రారంభించారు, ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు రమేష్ చౌదరి మాట్లాడుతూ షటిల్ బ్యాట్ మెంటన్ యూత్ సభ్యులు దొర్నిపాడులో జరగనున్న అంకాలమ్మ తీరునాల సందర్బంగా కమిటీ సభ్యులునన్ను సంప్రదించిమండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పడంతో వారి కోరిక మేరకు మూడు బహుమతులు 10వేలు 5వేలు 3వేలు అందజేశాను అన్నారు ఎప్పుడైనా యువతకు క్రీడాలప్రోత్సహకానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అన్నారు. గత సంక్రాంతి కి కూడ ఇలాంటి పోటీలు నిర్వహించామన్నారు, అనంతరం ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడలకు యువత వారు చేసే ప్రతి మంచి పనికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు,దొర్నిపాడు బ్యాట్మెంటన్ అసోసియేసన్ ఆర్గనైజర్స్ కాకర్ల శ్రీనివాస చౌదరి, భూపనపాటి మనోజ్ , జంగిటి మహేంద్రా లు,మాట్లాడుతూ టీడీపీ సీనియర్ నాయకుడు .న్యాయ వాది కాకర్ల రమేష్ చౌదరి, క్రీడాలకు ఎంతో సహకారం అందిస్తున్నారని అన్నారు .ఎప్పుడు మేము అడిగిన క్రీడలకు తోడ్పాటు అందించి క్రీడా అభివృద్ధికి కృషి చేస్తున్నారు అన్నారుఅందుకు దొర్నిపాడు షటిల్ అసోసియేసన్ తరుపున కృతజ్ఞ తలు తెలుపుతున్నాము అన్నారు ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు భాస్కర్ రెడ్డి షటి ల్ బ్యాట్మెంటన్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, జాఫర్ హుస్సేన్, హుస్సేన్ భాష , ప్రసాద్. వెంకటేష్ తిరుపాల్ హర్ష వర్ధన్, వెంకీ పాల్గొన్నారు



## పోరంబోకు భూమిలో అక్రమముగా నిర్మించినఇళ్లను కోర్టు ఉత్తర్వులు మేరకు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



**(బీమవరం వీరవాసరం)బ్యూరో చీఫ్ : మే 2, నంది పత్రిక** వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో చెరువు పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మించబడిన ఇళ్లను కోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన ప్రాంతాన్ని శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమారి రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు బాధితులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. మొత్తం తొలగించిన ఇళ్లలో అర్హత కలిగిన 16 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాలు (పట్టాలు) మంజూరు చేయడంతో పాటు, గృహ నిర్మాణానికి గృహ నిర్మాణ సంస్థల ద్వారా రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదనంగా, డ్వాక్రా సంఘాల ద్వారా కూడా అవసరమైన రుణ సదుపాయం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఇళ్ల తొలగింపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారి పునరావాసం కోసం పూర్తి సహకారం అందిస్తుందని, ఇళ్ల నిర్మాణంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి వై. దోసి రెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు.

ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లుఅయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనేపరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ

కొట్టించేందుకు తయారవుతున్నారు. కమిషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు.

దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# లోకేశ్ చేతలే జవాబు

..ద్రవిడ పార్టీల తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం నిలబడింది. రాష్ట్రం విడిపోయినా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైనా తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. తెలంగాణలో పార్టీ పటిష్ఠంగా లేకపోయినా ఓటర్లు మాత్రం ఉన్నారు...పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ చేతికి భవిష్యత్తులో పార్టీ పగ్గాలు అందుతాయి. ఎన్టీఆర్ హయాంతో పోల్చితే ఇప్పుడు రాజకీయాలకు నిర్వచనమే మారిపోయింది. పెద్ద మనిషి తరహా రాజకీయాలకు కాలం చెల్లింది. జగన్మోహన్ రెడ్డి వంటి వారి ప్రవేశంతో రాజకీయాల స్వరూపమే మారిపోయింది. ..చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం ఈ తరం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు రుచించడం లేదు. నాయకుడి నిర్ణయాలు, చర్యలు వేగంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. రాజకీయాల్లో ఓర్పు అవసరం అని మరచిపోతున్నారు. కంటికి కన్ను, పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని వారు ఆశిస్తున్నారు. ..ఎన్టీఆర్ తర్వాత పార్టీ భవిష్యత్తు ఏమిటి? అన్న సందేహాలను చంద్రబాబు పటాపంచలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత? అని ఎదురయ్యే ఈ తరహా సందేహాలకు చంద్రబాబు క్రియాశీలకంగా ఉన్నప్పుడే లోకేశ్ తన చేతల ద్వారా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తనలో పరిణతి వచ్చిందని నమ్మకం కలిగించడంలో మాత్రం లోకేశ్ సక్సెస్ అయ్యారు. పాత తరాన్ని, నవ తరాన్ని కలుపుకొని పోవాల్సిన బాధ్యత లోకేశ్‌పై ఉంది. ..తెలుగునాట వారసులుగా రంగ ప్రవేశం చేసి రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారిలో లోకేశ్ మూడవ వ్యక్తి. అధినాయకుల వారసులైనప్పటికీ కార్యకర్తలు, ప్రజలతో మమేకం అయ్యే వారికే ఆదరణ ఉంటుంది. తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు మూడో తరం సిద్ధమవుతోంది. ఒక ప్రాంతీయ పార్టీ మూడు తరాల నాయకత్వంలో సజీవంగా, పరిపుష్టంగా ఉండటం ఆషామాషీ కాదు. 'నాతో మొదలైన పార్టీ నాతోనే పోతుంది' అని పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు నిర్వేదంలో ఉన్నప్పుడు అన్నప్పటికీ నాలుగు దశాబ్దాలుగా పార్టీ సగర్వంగా నిలబడింది. మన దేశంలో తమిళనాడులో మాత్రమే ప్రాంతీయ పార్టీల సంస్కృతి ఉండేది. పెరియార్ రామస్వామి నాయకత్వంలో ప్రారంభమైన ద్రవిడ ఉద్యమం నుంచి అన్నాదురై అధ్యక్షతన డీఎంకే పార్టీ ఆవిర్భవించింది. ఆ తర్వాత డీఎంకే నాయకులైన కరుణానిధి, ఎంజీఆర్ మధ్య విభేదాలు వచ్చి అన్నాడీఎంకే ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఈ రెండు పార్టీలూ తమిళనాడును ఏలుతూనే ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలలో డీఎంకే, అన్నాడీఎంకేకు ఉన్న చరిత్ర మరే ఇతర ప్రాంతీయ పార్టీకీ లేదు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు, మధ్యలో వచ్చి పోయిన జనతా పార్టీ తమిళనాడులోని ఆ రెండు పార్టీలనూ ఏ మాత్రం కదిలించలేకపోయాయి. సినీ నటుడిగా మద్రాసులో ఉంటూ తమిళనాడు రాజకీయాలను దగ్గర నుంచి గమనించిన ఎన్టీఆర్, 1982లో తెలుగునాట తెలుగుదేశం పార్టీకి పురుడు పోశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. జయాపజయాలను చవిచూసింది. 1984లో, 1995లో పార్టీలో సంక్షోభాలు తలెత్తాయి. ఎన్టీఆర్ జీవితంలోకి ఒక వ్యక్తి ప్రవేశించడంతో 1995లో పార్టీ నాయకత్వ మార్పిడి అనివార్యమైంది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడి చేతికి పార్టీ పగ్గాలు వచ్చాయి. చంద్రబాబు నాయకత్వంలోకి వచ్చిన తర్వాత కూడా తెలుగుదేశం పార్టీ అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంది. ద్రవిడ పార్టీల తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం నిలబడింది. రాష్ట్రం విడిపోయినా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైనా తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. తెలంగాణలో పార్టీ పటిష్ఠంగా లేకపోయినా ఓటర్లు మాత్రం ఉన్నారు. దేశంలో మరే ఇతర ప్రాంతీయ పార్టీకీ లేని ప్రత్యేకతలు తెలుగుదేశం పార్టీ సొంతం. ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక స్థానాలు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ... లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించింది. అప్పుడు భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో రెండే స్థానాలు ఉండగా, తెలుగుదేశం పార్టీకి 30 స్థానాలు ఉండేవి. ఇలాంటి సంచలనాలు ఎన్నో తెలుగుదేశం పార్టీ ఖాతాలో ఉన్నాయి. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పదమూడు సంవత్సరాలే ఉండగా, 1995 నుంచి నేటి వరకు చంద్రబాబు నాయకత్వంలో ఆ పార్టీ అప్రతిహతంగా కొనసాగుతోంది.

**కొత్త తరం.. కొత్త పథం!** తెలుగునాట సరికొత్త రాజకీయాలకు ఒరవడి సృష్టించిన ఘనత తెలుగుదేశం పార్టీది. 1982లో పార్టీ ఏర్పాటును ప్రకటించిన ఎన్టీఆర్ 1983 ఎన్నికల్లో దాదాపు 90 శాతం సీట్లను యువతకు, రాజకీయ నేపథ్యం లేని వారికి కేటాయించారు. ఆ విధంగా రాజకీయాల్లోకి కొత్త తరం వచ్చింది. యనమల రామకృష్ణుడు, అశోక గజపతిరాజు, ప్రతిభా భారతి, తెలంగాణలో ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి వంటి వారు ఆ తరానికి చెందినవారే. చనిపోయిన వారు, రాజకీయాల నుంచి నిష్క్రమించిన వారు పోగా తొలి తరానికి చెందిన తెలుగుదేశం నాయకులు ఇప్పుడు ఆ పార్టీలో అరుదుగా కనిపిస్తారు. తెలుగుదేశం పార్టీతో ఆ తరానికి ఎన్నో భావోద్వేగాలు ఉండేవి. పార్టీ మహానాడులను పండుగలా జరుపుకొనే వారు. రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం వంటిది. ఆ పార్టీ బీట్ చూసిన నా వంటి జర్నలిస్టులు కూడా నాటి రాజకీయాలను దగ్గర నుంచి గమనిస్తూ ఎంతో నేర్చుకున్నాం. ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికలను కవర్ చేయడానికి 'ఔట్‌లుక్' మ్యాగజైన్ ప్రతినిధి ఢిల్లీ నుంచి వచ్చారు. అప్పటికి కొద్ది నెలల ముందే నేను 'ఆంధ్రజ్యోతి' పత్రికలో విలేఖరిగా చేరాను. అప్పుడు బ్యూరో చీఫ్‌గా ఉన్న ఐ.వెంకట్రావ్ ఔట్‌లుక్ ప్రతినిధితో పాటు నన్ను కూడా వెళ్లి ఎన్నికల కవరేజీ చేయవలసిందిగా కోరారు. అలా ఎన్నికలను ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకు లభించింది. మేం తిరిగి వచ్చిన తర్వాత 'పరిస్థితి ఏమిటి?' అని వెంకట్రావ్ ప్రశ్నించగా, కర్నూలులో కోట్ల విజయభాస్కర రెడ్డి, నంద్యాలలో పెండేకంటి వెంకట సుబ్బయ్య, ఒంగోలులో పులి వెంకటరెడ్డి, నరసరావుపేటలో కాసు బ్రహ్మానందరెడ్డి ఓడిపోతున్నారని చెప్పాను. ఇది ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే, ఆ స్థాయి నాయకులను సంచలనాత్మక రీతిలో ఓడించిన చరిత్ర తెలుగుదేశం పార్టీది. ఇలాంటి సంచలనాలకు చిరునామాగా ఉండిన తెలుగుదేశం పార్టీకి నాయకత్వం వహించడానికి మూడవ తరానికి చెందిన నారా లోకేశ్ ఇప్పుడు సిద్ధమవుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ మూడు రోజుల క్రితమే నూతన కమిటీతో పాటు బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబుకు నాయకత్వ మార్పిడి ఇలా సాఫీగా జరగలేదు. పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు ఆయనకు కుడి భుజంగా వ్యవహరించారు. ఎన్టీఆర్ పెద్దల్లుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు కూడా పార్టీలోనే ఉన్నప్పటికీ చంద్రబాబు నెంబర్ టూగా చలామణి అయ్యారు. ఎన్టీఆర్‌ను కలుసుకోలేకపోయిన నాయకులు, కార్యకర్తలను, స్థానికంగా, పార్టీపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న వారందరినీ అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా చంద్రబాబు కలుసుకొనేవారు. వారికి సాంత్వన కలిగించేవారు. అదే సమయంలో పార్టీలో నెంబర్ టూగా ఉన్న ఆయనను అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసేది. దీంతో ఆయన అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవారు. ఈ కారణంగానే చంద్రబాబు ఇప్పటికీ ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. లోకేశ్ వలె చంద్రబాబుకు రాజకీయ కుటుంబ నేపథ్యం లేదు. కష్టాన్ని మాత్రమే నమ్ముకొని చంద్రబాబు రాజకీయాల్లో ఎదిగారు. భూదేవికి ఉన్నంత ఓర్పును సొంతం చేసుకున్నారు. ఫలితంగానే ఎన్టీఆర్ జీవితంలోకి ప్రవేశించిన వ్యక్తి కారణంగా 1995లో తిరుగుబాటు చోటుచేసుకున్నప్పుడు మెజారిటీ ఎమ్మెల్యేలు, నాయకులు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచారు. ఆ వ్యక్తి ఎన్టీఆర్ జీవితంలోకి ప్రవేశించి అరాచకంగా వ్యవహరించి ఉండకపోతే చంద్రబాబు పరిస్థితి ఏమిటో తెలియదు.

**సీన్ కట్ చేస్తే..**

మొత్తంమీద మూడు దశాబ్దాలుగా చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ సురక్షితంగా ఉంది. ఇప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ చేతికి భవిష్యత్తులో పార్టీ పగ్గాలు అందుతాయి. ఎన్టీఆర్ హయాంతో పోల్చితే ఇప్పుడు రాజకీయాలకు నిర్వచనమే మారిపోయింది. ఆ నాటి రాజకీయాలు వేరు ఈనాటి రాజకీయాలు వేరు. పెద్ద మనిషి తరహా రాజకీయాలకు కాలం చెల్లింది. జగన్మోహన్ రెడ్డి వంటి వారి ప్రవేశంతో రాజకీయాల స్వరూపమే మారిపోయింది. కార్యకర్తల్లోనే కాదు, ప్రజల ఆలోచనా విధానం, ఆకాంక్షల్లో కూడా మార్పు వచ్చింది. ఈ కారణంగానే చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం ఈ తరం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు రుచించడం లేదు. నాయకుడి నిర్ణయాలు, చర్యలు వేగంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. రాజకీయాల్లో ఓర్పు అవసరం అని మరచిపోతున్నారు. కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని వారు ఆశిస్తున్నారు. జగన్ రెడ్డి పాలనలో కష్టనష్టాలను చవిచూసిన వారు ప్రతీకారాన్ని కోరుకుంటున్నారు. ఎన్టీఆర్ ఆకస్మిక, అనూహ్య నిర్ణయాలకు చిరునామా కాగా, చంద్రబాబు సంగతి తెలిసిందే. మూడో తరానికి చెందిన లోకేశ్ తాత ఎన్టీఆర్ లక్షణాలు పుణికి పుచ్చుకున్నాడని చెబుతారు. నిర్ణయాలు తీసుకోవడంలో అతను వేగం ప్రదర్శిస్తున్నాడు. ఎన్టీఆర్ తర్వాత పార్టీ భవిష్యత్తు ఏమిటి? అన్న సందేహాలను చంద్రబాబు పటాపంచలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత? అని ఎదురయ్యే ఈ తరహా సందేహాలకు చంద్రబాబు క్రియాశీలకంగా ఉన్నప్పుడే లోకేశ్ తన చేతల ద్వారా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. 2014 తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన లోకేశ్‌లో కొంత అపరిపక్వత కనిపించింది. దానికితోడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చినప్పుడు జగన్ రెడ్డి అండ్ కో లోకేశ్‌ను టార్గెట్ చేసుకున్నారు. అతడిని 'పప్పు' అని పిలుస్తూ హేళన చేశారు. తద్వారా తాను పప్పు కాదు నిప్పు అని నిరూపించుకొనే పరిస్థితి కల్పించారు. 2019 వరకు మంత్రిగా పనిచేసిన లోకేశ్‌కు పెద్దగా ఎదురు దెబ్బలు తగల్లేదు. అధికారం అండగా ఉన్నందున సాఫీగా సాగిపోయింది.

## విరామ బైబిల్ పాఠశాల ర్యాలీ..



**ఆళ్లగడ్డ ప్రతినిధిమే 2నంది పత్రిక** వేసవి సెలవులలో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఆళ్లగడ్డ పట్టణంలోనిపుల్లారెడ్డి వీధిలో ఉన్న గెత్సమనేప్రార్థన మందిరంలో దైవ సేవకులు బి అబ్రహం, బి ఐజాక్ ఆధ్వర్యంలో విరామ బైబిల్ పాఠశాల ప్రారంభించారు.వారికి ఆధ్యాత్మిక చింతన తో పాటు, విద్య, వైజ్ఞానిక , సాంస్కృతిక , సామాజిక అంశాలతో పాటు మెదడును పదును పెట్టే విధంగా రంగురంగుల బొమ్మలను, చిన్నపిల్లలచే విబిఎస్ టీచర్లు వేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు, కిషోర బాల,బాలికలు, వి బి ఎస్ టీచర్లు, వాలంటీర్లు , సంఘ సభ్యులు శనివారం నాడు ర్యాలీ నిర్వహించారు. ప్రార్థన మందిరం నుండి ప్రారంభించిన ర్యాలీ, పుల్లారెడ్డి వీధి నంద్యాల రోడ్డు నాలుగు రోడ్ల సెంటర్ విజ్ఞాన భారతి స్కూలు , వీధుల గుండా ప్రార్థన మందిరం వరకు ర్యాలీ నిర్వహించి, వాయిద్యాలతో పాటలు పాడుచు విరామ బైబిల్ పాఠశాల పిల్లలను ఆనందింప చేశారు. పిల్లలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లం డేవిడ్, దేవ సహాయం, చింతల శేఖర్, మోహన్ బాబు నాని,చింటూ , వినోద్, దీపక్, ప్రిన్స్ ఇజ్రాయిల్ , బేబీ, ఫ్లోరా,మోనిక, చందన, బ్యులా, గ్లోరీ, మేరీ, కృప. పలువురు పాల్గొన్నారు.

## పాత్రికేయుడిపై దాడి అమానుషం

### చిన్న పత్రికల సంక్షేమ సంఘం తీవ్ర నిరసన



**అనంతపురం బ్యూరోచీఫ్ , మే2 నంది పత్రిక :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు పెరిగిపోవడం పట్ల చిన్న పత్రికల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబుళంపల్లి రామకృష్ణ ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తే , పాత్రికేయుడిపై, అది కూడా తన కుటుంబ సభ్యుల సమక్షంలోనే విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.రామకృష్ణ మాట్లాడుతూ, మనం లక్ష్మీనారాయణ నివాసానికి వచ్చి, పాత్రికేయుడిని భయభ్రాంతులకు గురిచేయడం అరాచకానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ఈ ఘటన వెనుక ఉన్న మనీషా నాయర్ మరియు సంబంధిత వ్యక్తులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారుదాడికి పాల్పడిన వారిపై తక్షణమే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ లేదా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి. అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, విలేకరులను బెదిరిస్తున్న సదరు జూనియర్ కళాశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, దాని గుర్తింపును రద్దు చేయాలి.పాత్రికేయులకు మరియు వారి కుటుంబాలకు ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలి."కలాన్ని ఆపాలని చూస్తే సహించేది లేదు. పాత్రికేయుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు చిన్న పత్రికల సంక్షేమ సంఘం అండగా ఉంటుందని ఓబుళంపల్లి రామకృష్ణ తెలిపారు.

## ఎండాకాలంలో కోతలు ఉండకూడదు
## సరఫరాలో ఎక్కడా లోటు రానీయవద్దు

వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. ఉత్పత్తి , సరఫరాలో ఎక్కడా లోటు రానీయవద్దన్నారు. శనివారం విద్యుత్ సీఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారికంగా లేదా అనధికారికంగా ఏపీలో ఎక్కడా కరెంట్ కోతలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ కోతలు విధించాల్సి వస్తే ప్రజలకు ఆ సమాచారం చెప్పటంతో పాటు వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని మంత్రి దిశానిర్దేశర చేశారు. వేసవి డిమాండ్‌కు తగ్గట్లుగా సరిపడా కరెంట్ అందుబాటులో ఉన్నా అక్కడక్కడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని మంత్రి ఆరా తీశారు. అధిక ఉష్ణోగ్రతలతో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవటం, అకాల వర్షాల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

## ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా
## బిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్

ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్మాదనం చెప్పకుండా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. . ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారంహైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

## అర్ధరాత్రి యువకుడిపై దాడి

వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన జరిగింది. శివ (27 ) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముందు వదిలి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com